


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయుజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 99 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శనివారం 21 జూన్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




## ఇంగ్లీష్ వద్దనడం పేదలను చులకన చేయడమే

వారిని ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర - ఇంగ్లీష్ ఒక వారధిలాంటి భాష మాత్రమే

### అమిత్ షా వ్ఆయఖ్యలకు ఎక్స్ వేదికగా రాహుల్ కౌంటర్

న్యూఢిల్లీ,జూన్20(సమయజ్యోతి):



ఇంగ్లీష్ మాట్లాడే వాళ్లు త్వరలోనే సిగ్గుపడాల్సి వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ శుక్రవారంనాడు తప్పుపట్టారు. దేశంలోని పేద పిల్లలను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర చేస్తున్నాయని అన్నారు. 'ఇంగ్లీష్ అనేది డ్యామ్ కాదు, ఒక బ్రిడ్జి. ఇంగ్లీష్ అంటే సిగ్గు కాదు, పవర్. ఇంగ్లీషు అనేది ఒక చైన్ కాదు, చైన్‌లను బ్రేక్ చేసే పరికరం. ఇండియాలోని పేద పిల్లలు ఇంగ్లీష్ చదువుకోవడం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఇష్టం లేదు. వాళ్లను ప్రశ్నించేవారు ఉండకూడదని వారు కోరుకుంటున్నారు. తమతో సమానంగా ఎదగడం కూడా వారికి ఇష్టం లేదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు.ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రతిరోజూ ఇంగ్లీష్ మాట్లాడవద్దని,హిందీలో మాట్లాడమని చెబుతుం టారని, అయితే ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలోని పిల్లల మాత్రం ఇంగ్లీషు విద్యకు వెళ్తుంటారని, దీని వెనుక కారణమేమిటని రాహుల్ ప్రశ్నించారు. ఎందుకంటే పేద పిల్లలు బోర్డ్ రూముల్లోకి ఎంటర్ కారాదని, అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు రాకూడదని వారు కోరుకుంటున్నారని అన్నారు. వాళ్లు ఇంగ్లీషు స్కూళ్లకు వెళ్లి కాంటాక్టులు పెంచుకుంటారని, పేద పిల్లలకు మాత్రం తలుపులు మూసేస్తారని ఆక్షేపణ తెలిపారు.సాధికారతకు మాతృభాషతో పాటు ఇంగ్లష్ చాలా అవసరమని, ఇంగ్లీష్ విద్య విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని, ఉపాధిని కల్పిస్తుందని రాహుల్ అన్నారు. దేశంలోని ప్రతి భాష ఆత్మవంటిదని, సంస్కృతి, నాలెడ్జికి ప్రతీక అని అన్నారు. భాషాభివృద్ధి జరగాలని, అదే సమయంలో ప్రతి ఒక్క పిల్లవాడికి ఇంగ్లీష్ బోధించాలని అన్నారు. అప్పుడే ప్రపంచంతో భారత్ పోటీ పడగలుగుతుందని, ప్రతి ఒక్క పిల్లవాడు సమానావకాశాలు పొందగలడని రాహుల్ స్పష్టం చేశారు.

## యోగాతో యోగ్యత వస్తుంది

ఎల్బీ స్టేడియం యోగాలో వెంకయ్యనాయుడు-కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

హైదరాబాద్,జూన్20(సమయజ్యోతి):

యోగా చేస్తే యోగ్యులు అవుతారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. ఎల్బి స్టేడియంలో జరిగిన యోగా కౌంట్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా వెంకయ్యనాయుడు మాట్లాడారు. మానసిక శక్తులను ఏకం చేసేది యోగా అని ప్రశంసించారు. విశ్వమంతా పరిపూర్ణ ఆరోగ్యంతో, శాంతితో ముందుకు సాగాలన్నదే యోగ దినోత్సవ సంకల్పమని స్పష్టం చేశారు. యోగాకు మతం లేదు జాతి లేదని, యోగా మన జీవన విధానమని తెలియజేశారు. ప్రపంచంలోనే అద్భుత సాహసం ఆపరేషన్ సింధూర్ అని కొనియాడారు. ఒకే భూమి? ఒకటే ఆరోగ్యం కోసం యోగ అని అనే సంకల్పంతో ఈ ఏడాది యోగ దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందని, మనమంతా ఇదే సంకల్పాన్ని తీసుకుని వసుధైవ కుటుంబ భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది యోగ మార్గాన్ని సాధన చేస్తూ ముందుకు సాగుతున్నారని, విదేశీయులంతా యోగ మార్గాన్ని తలకెత్తుకుని ముందుకు సాగుతుంటే, ఈ నేల మీద పుట్టిన మనం యోగ మార్గానికి ఇంకెంత గౌరవం ఇవ్వాలో ఒక్కసారి ఆలోచించుకోవాలని, యోగ మార్గాన్ని అనుసరించవలసిందిగా వెంకయ్యనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వెంకయ్యనాయుడు.. కిషన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, సినీనటులు కుష్బూ, మీనాక్షి చౌదరి హాజరయ్యారు.

2 లో





## మళ్లీ అడ్డుకోవాలి

✸ బలమైన అభివృద్ధి దిశగా బీహార్ పయనం ✸ ఆటవిక రాజ్యం నుంచి బీహార్‌ను బయటపడేశాం ✸ 55,000 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు వేశాం ✸ 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్, 26 కోట్ల మందికి మంచినీటి సరఫరా ✸ పేదలకు మరో మూడుకోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తాం ✸ మళ్లీ ఆటవిక రాజ్యాన్ని రాకుండా అడ్డుకోవాలి ✸ బీహార్ పర్యటనలో ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు

పాట్నా,జూన్20(సమయజ్యోతి):

బీహార్‌ను ఆటవిక రాజ్యంలోకి నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. బీహార్‌లోని సివాన్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బిహార్‌లో తాజాగా మరోసారి పర్యటించిన మోదీ.. కాంగ్రెస్, ఆర్జేడీ కూటమిపై నిప్పులు చెరిగారు. బిహార్‌ను 'లైసెన్స్ రాజ్' సుదీర్ఘ కాలం పేదరికంలోనే ఉంచిందని, ఇందులో దళితులే అతిపెద్ద బాధితులుగా మారారని ఆరోపించారు. రాష్ట్రంలోని సివాన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన.. ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు.




2 లో




## ఎపితో కలసి వెళ్లాలన్నదే మా సిద్ధాంతం

- ▶బనకచర్లపై ఎపి సిఎంతో చర్చలకు సిద్ధం
- ▶జలవివాదాల పరిష్కారానికి ముందుంటాం
- ▶ఇరు రాష్ట్రాల మధ్య వివాదాలు కోరుకోవడం లేదు
- ▶23న కేబినేట్‌లో చర్చించి ఎపిని చర్చలకు ఆహ్వానిస్తాం
- ▶బిఆర్ఎస్ హయాంలోనే బనకచర్ల కోసం జీవోలు
- ▶ఆనాడు మాట్లాడని హరీష్ ఇవ్వాళ మాట్లాడడంలో అర్థం లేదు
- ▶ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో సిఎం రేవంత్ రెడ్డి

2లో.

న్యూఢిల్లీ,జూన్20(సమయజ్యోతి):

బనకచర్ల అంశం గురించి కూర్చొని మాట్లాడుకుంటే వివాదం ఉండదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎపి సిఎం చంద్రబాబుతో కలసి మాట్లాడేందుకు తనకు అభ్యంతరం లేదన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బనకచర్ల-గోదావరి ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబుతో చర్చలకు సిద్ధమని ప్రకటించారు. 23న కేబినేట్ భేటీలో దీనిపై చర్చిస్తామని అన్నారు. ఎపి సిఎంను తామే ఆహ్వానిస్తామని కూడా అన్నారు. 'ఏపీ.. కేంద్రానికి పీఎఫ్ఆర్ ఇవ్వడం వల్లే వివాదం మొదలైంది. పీఎఫ్ఆర్ ఇచ్చేముందే తెలంగాణతో చర్చించి ఉంటే వివాదం ఉండేదికాదు. ఆంధ్రప్రదేశ్ ప్రీ ఫీజిబులిటి రిపోర్ట్ (పీఎఫ్ఆర్) ఇచ్చిన వెంటనే కేంద్రం స్పందిస్తోంది. బనకచర్లపై కేంద్రం అన్ని రకాల చర్యలకు సిద్ధమైంది. ఇద్దరు సీఎంలు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై చర్చిద్దాం. ఒక రోజు కాదు నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాలమధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయన్నారు.



02

## అంధ విద్యార్థుల గీతాలాపన

### భావోద్వేగంతో కంటతడి పెట్టిన రాష్ట్రపతి ముర్ము

డెహ్రాడూన్,జూన్20(సమయజ్యోతి):

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వేదికపైనే భావోద్వేగానికి గురయ్యారు. కంట తడి పెట్టారు. రాష్ట్రపతి తన 67వ పుట్టినరోజు సందర్భంగా డెహ్రాడూన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు అంధ విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ గీతాలు ఆలపించారు. ఈ క్రమంలోనే ద్రౌపది ముర్ము భావోద్వేగానికి లోనయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఉత్తరాఖండ్‌లో మూడు రోజుల పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్ డిసేబిలిటీ (ఎన్ఐఈపీవీడీ)ని సందర్శించారు.

## కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరాం

### పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,జూన్ 20(సమయజ్యోతి):



మాజీ ఎమ్మెల్సీ, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరామని, డీసీసీ పరిశీలకుడి నుంచి నివేదిక వచ్చాక స్పందిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కొండా మురళి పరకాల సీటుపై రేవూరి ప్రకాశ్ రెడ్డిపై ఘాటు వ్ఆయఖ్యలు చేశారు. ఇకపోతే సంబంధం లేని పంచాయతీ ఎన్నికలపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడటం సరికాదని ఆయనకు సూచించినట్టు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# మళ్లీ అడ్డుకోవాలి

ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రధాని ప్రస్తావిస్తూ, 55,000 కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మందికి పైపుల ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. బీహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృతం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు. పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజలే తన కుటుంబ సభ్యులనీ, కుటుంబంలోని ఏ ఒక్కరూ కడగండ్లపాలు కాకుండా చూస్తామని, వారి కోసం రేయింబవళ్లూ శ్రమిస్తామని, తమ కల నిజమయ్యేంత వరకూ విశ్రాంతి తీసుకునేది లేదని చెప్పారు. 'బిహార్‌ను ఎన్డీయే అభివృద్ధి చేస్తుందనడానికి మర్హౌరా రైలు ఫ్యాక్టరీ ఓ ఉదాహరణ. ఇప్పుడు ఆఫ్రికాలోనూ బిహార్‌కు ప్రశంసలు వస్తాయి. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు పట్టించుకోని సరన్ జిల్లాలోనే ఈ రైల్వే ప్రాజెక్టు కొనసాగుతోంది. తయారీ, ఎగుమతుల్లో ఈ జిల్లా ఇప్పుడు ప్రపంచ పటంలో స్థానం సంపాదించుకుంది. బిహార్ అభివృద్ధిని సుదీర్ఘకాలంగా 'జంగిల్ రాజ్' అడ్డుకుంది. కానీ, ఇప్పుడు బిహార్‌లో తయారైన ఇంజిన్ ఆఫ్రికన్ రైలుకు శక్తినిస్తుంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని మా ప్రభుత్వం చెబుతుంటే.. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు మాత్రం 'పరివార్ కా సాత్' అంటూ వారి కుటుంబ శ్రేయస్సుకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో పేదరికానికి కాంగ్రెస్ 'లైసెన్స్ రాజ్' కారణమన్నారు. నేతల కుటుంబీకులు ధనవంతులు కాగా.. సామాన్యులు మాత్రం పేదలుగానే మిగిలిపోయారన్నారు. రానున్న రోజుల్లో మూడు కోట్ల ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రజాసేవ చేయకుంటే తాను ప్రశాంతంగా నిద్రపోలేనని.. రాత్రి-పగలు ప్రజల కోసమే పని చేస్తానని వ్యాఖ్యానించారు. బీహార్ స్వాతంత్ర్య సమరయోధుల గడ్డ అని ప్రశంసించారు. భారతదేశం గ్లోబల్ పవర్‌గా ఎదగడంలో బీహార్ కీలక భూమిక వహిస్తోందని చెప్పారు. భారతదేశం శీఘ్రగతిన పురోగమిస్తుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, త్వరలోనే ప్రపంచలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని వారు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. సందర్భంగా పలు హౌసింగ్, వాటర్, రైల్, పవర్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ కింద 6,600 మంది లబ్దిదారులకు తాళం చెవులు అందజేశారు. పీఎంఏవై-యూ లబ్దిదారులకు తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.536 కోట్లు విడుదల చేశారు. మర్హౌరా ప్లాంట్‌లో తయారైన లోకోమోటివ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఎపితో కలసి వెళ్లాలన్నదే మా సిద్ధాంతం

న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం. వివాదాల పరిష్కారంలో నాకెలాంటి బేషజాలు లేవు. ఇద్దరు వ్యక్తులు కాదు.. రాష్ట్రాల మధ్య వ్యవహారం ఇది. విభజనచట్టం ప్రకారం ప్రాజెక్టుల్లో మార్పులు చేస్తే చెప్పుకోవాలి. విభజన చట్టం ప్రకారం గతంలో సీఎంల స్థాయిలో చర్చలు జరిపాం. అనేక అంశాలను సీఎం స్థాయిలో చర్చించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు. కింది రాష్ట్రంగా ఏపీకి హక్కులు ఉన్నాయంటున్నారు. అదే రకమైన హక్కులు తెలంగాణకు కూడా ఉంటాయి. ఈనెల 23న రాష్ట్ర కేబినెట్ సమావేశం ఉంది. కేబినెట్‌లో బనకచర్లపై చర్చిస్తాం. ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. మోదీ సీట్లో కూర్చోవాలంటే చంద్రబాబు సపోర్టు కావాలి. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలంటే గోదావరి నీటిని తరలించాలి. విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. బనకచర్లపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. 2016, 2018లో ఏపీ సర్కారు రెండు జీవోలు ఇచ్చింది. ఏపీ జీవోల ఆధారంగా వ్యాప్కోస్ 150 పేజీల నివేదిక ఇచ్చింది. గోదావరి-పెన్నా అనుసంధానంలో బనకచర్ల ఒక భాగం. 86 రోజుల్లో 400 టీఎంసీలు తరలించేలా బనకచర్ల డిజైన్ చేశారు. గోదావరిలో 968 టీఎంసీలు వాడే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కేటాయించింది వాడుకునేందుకు అవకాశం ఇవ్వట్లేదు. కేటాయింపులు వాడుకునే అవకాశం ఇవ్వక పోవడంతోనే వివాదం. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడం మంచిది. ఈ వివాదం పరిష్కారానికి ఎలాంటి డెడ్‌లైన్ లేదు' అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రం ఏపీతో వివాదాలు కోరుకోవట్లేదని.. కానీ ఎవరి కోసమో మా హక్కులు వదులుకోబోమని తేల్చి చెప్పారు. జూన్ 23న కేబినెట్ భేటీ నిర్వహించి.. ఇందులో బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చిస్తామన్నారు. ఆ తర్వాత అవసరమైతే మేమే ఒక అడుగు ముందుకేసి బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ గవర్నమెంట్‌ని చర్చలకు ఆహ్వానిస్తామన్నారు. చర్చల ద్వారానే జల వివాదాలకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాలతో తెలంగాణ అనవసరమైన వివాదాలను కోరుకోవడం లేదని.. పైన ఉన్న కర్ణాటకతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లే ఏపీతోనూ మంచి రిలేషన్ కొనసాగించుకోవాలనేది మా విధానమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మళ్లీ తెలంగాణ సెంటిమెంటును అడ్డంపెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తోందని.. ఇప్పుడు గోదావరి జలాల ఇష్యూని చచ్చిపోయిన బీఆర్ఎస్ సంజీవనిలా వాడుకోవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణకు సాగునీటిలో విషయంలో అన్యాయం చేసిందే కేసీఆర్, హరీష్ రావు అని ఫైర్ అయ్యారు. బనకచర్ల ప్రాజెక్టుకు బీజం పడిందే 2016 బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అని గుర్తు చేశారు. 2016-2018లో బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వే చేయాలని ఏపీ ప్రభుత్వం జీవోలు ఇచ్చిందని.. అప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు అభ్యంతరం చెప్పలేదు..? ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఎందుకు కోర్టులను ఆశ్రయించలేదని ప్రశ్నించారు. గోదావరి వరద జలాలను ఏపీకి తరలించుకుపోయేందుకు అపెక్స్ కౌన్సిల్లో అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపారని అన్నారు. కేసీఆర్, హరీష్ రావు చెప్పే అబద్దాలకు దేవుడు కూడా ఆశ్చర్యపోతాడని, నేనేనా వీళ్లను సృష్టించిదని షాక్ అవుతాడని ఎద్దేవా చేశారు. హరీష్ రావు అతి తెలివితో అసహనంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. హరీష్ రావు తాటి చెట్టులా పెరిగాడు గానీ సరియైన నాలెడ్జి లేదన్నారు. నీటి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగడానికి ప్రధాన కారకుడు హరీష్ రావు అని ఆరోపించారు. ఇప్పుడు ప్రధాని మోడీకి చంద్రబాబు నాయుడు అవసరం. ఏపీలో మళ్ళీ ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబుకు గోదావరి వరద జలాల అవసరం. అలాగే తెలంగాణలో పార్టీని బతికించుకోవడానికి బీఆర్ఎస్?కు బనకచర్ల ఇష్యూ అవసరం. వీరంతా కలిసి మమ్మల్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేబినెట్ ఆమోదంతోనే కాళేశ్వరం డిజైన్లు రూపొందించారన్న బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ వ్యాఖ్యలకు తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డికి ట్యూషన్ మాస్టర్ కేసీఆర్.. కేటీఆర్‌కు లైజనింగ్ ఆఫీసర్ కిషన్ రెడ్డి అని సీఎం రేవంత్ సెటైర్ వేశారు.

మొదటిపేజీ తరువాయి

# కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరాం

న్యాయస్థానంలో ఉన్న అంశంపై పొంగులేటి మాట్లాడటంపై తాను అభ్యంతరం వ్యక్తం చేసినట్టు వివరించారు. పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు మాట్లాడిన మాటలే తప్ప వేరే ఉద్దేశం కాదని పొంగులేటి చెప్పినట్లు వివరించారు. న్యాయస్థానం తీర్పు తర్వాతనే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని పీసీసీ అధ్యక్షుడు స్పష్టం చేశారు. మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా తమ పరిధిలో లేని అంశాలను మాట్లాడవద్దని సూచించారు. ఇతరుల శాఖల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేశారు. విధానపరమైన అంశాల విషయంలో పార్టీపరంగా చర్చించి, మంత్రి మండలిలో నిర్ణయం తీసుకున్న అంశాలపై మాట్లాడితే ఎలాంటి అభ్యంతరం ఉండదని వివరించారు. అలా కాకుండా అంతర్గతంగా మాట్లాడుకున్న అంశాలను మీడియాతో మాట్లాడవద్దని మాత్రమే తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో తానే అభ్యర్థిని అని అజహరుద్దీన్ మాట్లాడటంలో తప్పు లేదన్న మహేశ్‌కుమార్‌గౌడ్.. గతంలో పోటీ చేసినందున తిరిగి తననే పోటీలో నిలుపుతారన్న భావనతో చెప్పి ఉంటారని అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్న కృతనిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు వివరించారు.

# దుబ్బాకలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

## మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా వివేక్ వెల్లడి

## ఇందిరమ్మ ఇళ్లు పట్టాలు పంపిణీ చేసిన మంత్రి

**సిద్దిపేట,జూన్ 20(సమయజ్యోతి):**

దుబ్బాకలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తామని మంత్రి వివేక్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా వివేక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..12 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తోందన్నారు. ప్రజలందరూ ఇందిరమ్మ ఇల్లు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలకు స్వేచ్ఛనిచ్చామని చెప్పారు. ప్రజలకు మేలు చేయాలనదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వంటి ఎన్నో మంచి పనులు చేసిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని అన్నారు. రైతులందరికి పెట్టుబడి సాయం కింద రైతు భరోసా అందిస్తున్నామని, సన్న వడ్లు పండించిన వారికి రూ.500 బోనస్ ఇస్తున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలు కూడా సన్న బియ్యం తినాలనే సదుద్దేశంతో రేషన్ ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు అన్ని స్కీములు అమలు చేస్తామన్నారు. త్వరలోనే రాజీవ్ యువ వికాసం పథకం కూడా ప్రారంభమవుతోందని చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ప్రజలు, అధికారులకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు.

# అంధ విద్యార్థుల గీతాలాపన

ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ, పిల్లలు ఎంతో అందంగా పాడుతుంటే భావోద్వేగానికి గురయ్యారని చెప్పారు. 'కన్నీళ్లు ఆగలేదు. పిల్లలు చాలా చక్కగా పాడారు. ఇది వారి హృదయం లోతుల్లోంచి వచ్చిన పాట' అని అన్నారు.పుట్టుకతోనే వైకల్యంతో పుట్టిన వారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, వారిలో ఆత్మవిశ్వాసం నింపి ముందుకు తీసుకువెళ్లే ఒకనాటి నిశ్చయంగా వారు సక్సెస్ అవుతారని రాష్ట్రపతి అన్నారు. వైకల్యంతో ఉన్న పిల్లల సాధికారత, సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పథకాల రూపకల్పన జరుగుతోందని చెప్పారు. వైకల్యంతో పుట్టిన పిల్లల సాధికారత కోసం పని చేస్తున్న ఎన్ఐఈపీవీడీని అభినందించారు. ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ (రిటైర్డ్), ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ థామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.






# వికసిత్ భారత్ సంకల్ప సభ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

వికసిత్ భారత్ సంకల్ప సభా సమావేశం రచ్చబండ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో భాజాప ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాలు 11 సంవత్సరాల పాలనలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా ఎల్ఈడి తెరపై ప్రదర్శిస్తూ మండల స్థాయి రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ముస్తాబాద్ గ్రామ పంచాయితీ ముందు ఉదయం 9 గంటలకు మండల స్థాయి రచ్చబండ నిర్వహించారు. మండల బిజెపి అధ్యక్షులు సౌల క్రాంతి కమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్రా కార్యవర్గ సభ్యులు రంజిత్ మోహన్ హాజరు అవగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేరుగు అంజా గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ రెడ్డి, నాయకులు వరి వెంకటేష్ చిట్నేని శ్రీనివాసరావు, బాధ నరేష్, పప్పుల శ్రీకాంత్, వెంకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు



# జీ.ఓ. 49 రద్దు చేయాలని డిమాండ్ చేసిన సీపీఎం

# ఆదివాసీలను వన్యప్రాంతాల నుంచి తొలగించేందుకు కుట్ర

**సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్ బ్యూరో**

కుమ్రం భీమ్ టైగర్ కారిడార్ పేరుతో ఆదివాసీలను తాము సాగు చేసుకుంటున్న భూముల నుంచి బలవంతంగా తొలగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని సీపీఎం ఆరోపించింది. ఈ నెపంతో తీసుకొచ్చిన జీ.ఓ. 49ని తక్షణమే రద్దు చేయాలని పార్టీ డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సీపీఎం పార్టీ శిక్షణ తరగతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ, "టైగర్ కారిడార్" పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అడవులను అప్పగించేందుకే ఈ చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్‌లో హసదే అటవీ ప్రాంతంలో ఆదాని గ్రూప్‌కు లక్షల ఎకరాలు అప్పగించిన ఉదాహరణను ఆయన ప్రస్తావించారు. ఇప్పటిదాకా 12 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, కేవలం 4 లక్షల ఎకరాలకు మాత్రమే పాత ప్రభుత్వం (బీఆర్ఎస్) పట్టాలు ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా మిగిలిన భూములపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు.

సీపీఎం డిమాండ్లు:

- జీ.ఓ. 49 మరియు టైగర్ కారిడార్ రద్దు
- అన్ని పోడు సాగుదారులకు హక్కుపత్రాలు
- అక్రమ కేసుల ఉపసంహరణ
- ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సౌకర్యాల మెరుగుదల, ఖాళీ పోస్టుల భర్తీ

ఈ కార్యక్రమంలో బండారు రవికుమార్, భూపాల్, పి. ఆశయ్య, ఉడుత రవీందర్, పూసం సచిన్, దర్శనాల మల్లేష్, కె. రాజన్న, సంకె రవి, గౌతమ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
ద.మం. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును
టెండర్ నెం. Tender No.Y/SG/36-2025-26/10 & 11 నాటి 19.06.2025
PUB/0742
భారత అధ్యక్షుడు తరపున, Sr.division సిగ్నల్ మరియు టెలికాం ఇంజనీర్, హైదరాబాద్ డివిజన్, సౌత్ సెంట్ అల్ రైల్వే సెకండరాబాద్ 21.07.2025 యొక్క 11.30 గంటల వరకు ఇ-సేకరణ ద్వారా ఈ క్రింది పనుల కోసం ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తుంది
S.No.: 01 టెండర్ నం.: Y/SG/36/025-26/10 పని పేరు: హెచ్‌బిఎల్ యొక్క నన్యూవల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ హైదరాబాద్ డివిజన్‌లో 48 ఇంటిగ్రేటెడ్ పవర్ సప్లై (ఐపిఎస్) వ్యవస్థలను రెండేళ్ల కాలానికి తయారు చేస్తుంది, సుమారు విలువ: 15264000, EMD: 226300
S.No.: 02 టెండర్ నం.: Y/SG/36/025-26/11 పని పేరు: అమరా రాజా యొక్క 22 మేజర్ మరియు 01 మినీ ఇంటిగ్రేటెడ్ పవర్ సప్లై (ఐపిఎస్) కోసం వార్షిక నిర్వహణ ఒప్పందం రెండు సంవత్సరాల కాలానికి హైదరాబాద్ విభాగాన్ని తయారు చేస్తుంది, సుమారు విలువ: 5118300, EMD: 102400
సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, హైదరాబాద్
A0917
మరింత టెండర్ షరతులు/వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్ లోడ్ చేయడానికి, దయచేసి వెబ్‌సైట్‌ను https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద సందర్శించండి

# కిసాన్ నగర్ వాసులకు బస్సు సౌకర్యం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలం కిసాన్ నగర్ లో గ్రామ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ, నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రతి బస్సు ఆపే విధంగా గ్రామ బస్టాండ్ లో ఒక కంట్రోలర్ని నాలుగు రోజులపాటు నియమించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఆడెపు మనోహర్, కార్యదర్శి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు వడ్డేన్న, కోశాధికారి సాయన్న, సీనియర్ సభ్యులు భోగ రామచందర్, శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్, కొండ నర్సయ్య, దేవరెడ్డి గుంటక రాజేశ్వర్, జీపి సెక్రటరీ రేణుక, నాయకులు దాసరి వెంకటేష్, చాట్ల నరేష్ పాల్గొన్నారు.



# నూతన కలెక్టర్ ను కలిసిన ముత్యాల సునీల్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ లో నూతన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.



# నేడు పాఠశాలల్లో యోగా దినోత్సవం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

ఈనెల 21న బాల్కొండ మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఉదయం 6:30 నుంచి 7:45 గంటల వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించాలని శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ధర్తి ఆబా జనభాగిదారి అభియాన్ అవగాహన శిబిరం

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ధర్తి ఆబా జనభాగిదారి అభియాన్ అవగాహన శిబిరానికి శుక్రవారం ఐటిడిఎ ఉట్నూర్ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర ప్రభారి అధికారి డిప్యూటీ సెక్రటరి గణేష్ నిరంజన్ కు పూల మొక్కను అందించి స్వాగతం పలికిన ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బు గుప్తా



# ధ్రువీకరించిన మాంసాన్నే విక్రయించాలి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో మేజర్ గ్రామపంచాయతీ కార్యానిర్వాహకులు రమేష్, పంచాయతీ సిబ్బందితో కలిసి, శుక్రవారం మాంసం విక్రత దుకాణాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. మాంసం వ్యాపారులు, విక్రయించే మాంసం అంశంలో శుచి శుభ్రత ఉండాలని తాజా మాంసాన్నే విక్రయించాలని, ఆరుబయట విక్రయించకుండా దుకాణంలోనే మాంసాన్ని విక్రయించాలని, దీంతో మాంసానికి ఈగల తాకిడి సమస్య ఉండకూడదని పేర్కొన్నారు. పశు వైద్యాధికారి ధ్రువీకరించిన ఆరోగ్యకర మైన గొర్రెలను మేకలను మాత్రమే మాంసంగా విక్రయించాలని సూచించారు. దీనికి విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్య తీసుకుంటామని అన్నారు. సీనియర్ అసిస్టెంట్ బిక్షపతి సిబ్బంది రాజు పాల్గొన్నారు



# క్రీడలకు ప్రభుత్వం పెద్ద పీట

## గ్రామీణ క్రీడాకారుల వెలికితీతకే సీఎం కప్

### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రజా ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, పార్లమెంటు కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి లతో కలిసి, సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్ నగర్ మినీ స్టేడియంలో ఆర్చరీ అకాడమీ ప్రారంభించారు. వేములవాడ పట్టణంలో ఇండోర్ స్టేడియం పనులు, సిరిసిల్ల పట్టణంలో బతుకమ్మ ఘాట్ వద్ద, చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో స్టేడియం నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. వారూ మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం లభిస్తుందని, మన ప్రాంతంలో అనేక మంది క్రీడాకారులకు నిలయంగా మారిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం, చందుర్తి మండలం మూడపల్లి వద్ద మినీ స్టేడియం నిర్మాణం, సిరిసిల్ల పట్టణంలో మినీ స్టేడియంలో నిర్మాణం కోసం స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఆర్చరీ అకాడమీనీ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రారంభించుకోవడం అభినందనీయమని, ప్రజా ప్రభుత్వంలో కోరుట్ల, వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో 5 ఎకరాలు స్టేడియం నిర్మాణం కోసంమంజూరి చేయడం జరిగిందన్నారు. ఎల్లపుడూ క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డి పోటీలు జిల్లా పరిదిలో తన వంతు ప్రోత్సాహకం



ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు పెద్ద పీట వేస్తున్నరని అందులో భాగంగా రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు జరుగుతుందన్నారు.క్రీడాకారులు జీవితంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వాటిని ఎదుర్కొనే ధైర్యం ఎక్కువగా ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనీ క్రీడాకారులను వేలికి తీయడానికి సీఎం కప్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. శివసేన రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కృషి ఫలితంగా నేడు వేములవాడ నియోజకవర్గంలో రెండు స్టేడియాలు మంజూరు అయ్యాయి. గత ప్రభుత్వం క్రీడాకారులను క్రీడలను ఏమాత్రం పట్టించుకోలేదు. వారూ 10 సంవత్సరాల కాలంలో క్రీడలకు 400 కోట్లు కేటాయిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో 11 నెలల్లోనే 800 కోట్లు క్రీడా రంగానికి కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి పాఠశాలలో క్రీడా సామాగ్రిని అందుబాటులో ఉంచి గ్రామాల్లో నుంచి ఒలంపిక్ లో ఆడేలా మెరికల్ లాంటి క్రీడాకారులను తయారు చేయనున్నట్లు తెలిపారు.

# రైతుల ఖాతాలలో వానాకాలం పంట పెట్టుబడి నిధులు జమ

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం వ్యవసాయ ఆధారిత ప్రాంత రైతులకు గత మూడు రోజుల నుండి వారి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.వానాకాలం - 2025 సీజన్ కు సంబందించి పంట పెట్టుబడి సాయం క్రింద రైతుల బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్ లో నమోదు చేశారని,ఈ వివరాలకు అనుగుణంగా పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకం లో భాగంగా168238 రైతులకి గాను 342.3 కోట్లు కేటాయించడం జరిగినదని ఈ రోజు శుక్రవారం వరకు 1,33,808 మంది రైతులకి గాను 212.74 కోట్లు రైతుల ఖాతాల లో జమ చేయటం జరిగిందని ప్రకటన లో జిల్లా కలెక్టర్ తెలియజేశారు.



సమయజ్యోతి
తెలుగు దినపత్రిక


## సంపాదకీయం

# ఆరోగ్య ప్రదాయిని యోగా !

నవ్వించడం యోగం..నవ్వకపోవడం రోగం అన్నారు. నవ్వుకూడా ఓ ఆరోగ్య ప్రక్రియ అని అందరూ తెలుసుకోవాలి. ఇకపోతే యోగా అన్నది భారతీయ జీవన విధానంలో ఉన్న ప్రాచీన ప్రక్రియ. ఇది శాస్త్రీయంగా రుజువు చేయబడింది. యోగాను పరిచయం చేసిన మనదేశం..ఇప్పుడు అంతర్జాతీయ యోగాను కూడా జరుపుకునేలా చేసింది. మనావులు ఎక్కడ ఉన్నా, ఏ స్థితితలో ఉన్నా యోగా వల్ల అనేకానేక రుగ్మతలను నిర్మూలించవచ్చు. యోగాతో శరీరం క్రమపద్ధతిలో మార్పు చెందడమే గాకుండా, జీర్ణప్రక్రియయతో పాటు, నాడీ వ్యవస్థను అదుపులో ఉంచుతుంది.. ఓ రకంగా చెప్పాలంటే యోగా అలవర్చుకున్న వారికి వారి శరీరం చెప్పినట్లుగా నడుచుకుంటుంది. విజ్ఞానశాస్త్ర ప్రకారం యోగా అంటేపరిపూర్ణ జీవనసార విధానం. భారతదేశం చేసిన ప్రయత్నంతో ఐక్యరాజ్యసమితి జూన్ 21న అంతర్జాతీయ యోగగా దినోత్సవంగా గుర్తించింది. దీంతో యోగాకు ప్రాధాన్యంతో పాటు, అంతర్జాతీ యంగా దీనిని ఆచరించే వారి సంఖ్య పెరిగింది. యోగా అనేది 5వేల సంవత్సరాల నుండి భారతదేశంలో ఉన్న జ్ఞానం యొక్కఅంతర్భాగంగా గుర్తించారు. యోగా చేస్తున్న వారిలో మానసిక, ఆరోగ్య సమస్యలు ఉండవని నిరూపితం అయ్యింది. నిత్యం యోగా చేసిన వారు ఆనందంగాను, ఉత్సాహంగానూ ఉండడాన్ని గమనించ వచ్చు. యోగ సూత్రాలను సరళంగా, వివరంగా, అందరికి అందుబాటులోనికి తీసుకురావటమే లక్ష్యంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అత్యంత లాభాన్ని నిజజీవితంలో ఎలా అనుభవించగలం అన్న అంశం మీద ఇది కేంద్రీకృతమై ఉంటుంది. ఆరోగ్య సమస్యలు గాని, భావావేశాలు గాని, వ్యక్తిగత జీవితం పైన ప్రభావాన్ని చూపుతుంటాయి. అలాంటి వారు యోగా సాధన ద్వారా ఉపశమనం పొందవచ్చని నిరూపితం అయ్యింది. జీవన సరళిలో చిన్న చిన్న మార్పులతో సమస్యలని సహజంగానే అధిగామించడం సాధ్యమనికూడా తెలుసుకోవచ్చు. నిత్యంయోగా చేస్తూ ఆనందమయ జీవితం పొందడానికి ప్రతి ఒక్కరూ కనీసం ఓ అరగంటయినా కేటాయిస్తే మంచి ఫలితం దక్కవచ్చు. ఏటా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నంగా భావించాలి. యోగాతో మనస్సు, శరీరం అదుపులో ఉంటుందని కూడా నిరూపితం అయ్యింది. ఇది వేల ఏళ్లుగా ఈ ప్రక్రియ సాగుతోంది. అందుకే ఐక్యరాజ్యసమితి మన వినతిని గుర్తించి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటించింది. జూన్ 21నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం ఆరోజు ఉత్తరార్ధ గోళంలో అత్యధిక పగటి సమయం కావడమే. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపుపొందడంతో అదేరోజును అంతర్జాతీయ యోగా దినోత్సవం గా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. యోగా దినోత్సవం అందుబాటులోకి వచ్చాక దీనిని ఓ కార్యక్రమంగగా కాకుండా నిరంతర ప్రక్రియగా ఆచరించడం మొదల య్యింది. అనేక దేశాలు, దీనిని ఆరోగ్యంలో భాగంగా అమలు చేస్తున్నాయి. ముస్లిం దేశాలు సైతం దీని ప్రాధాన్యాన్ని గుర్తించాయి. దీర్ఘకాలిక రోగాలను సైతం అదుపు చేసే అవకాశం యోగా ద్వారా లభించగలదు. చాలా మంది యోగా అంటే శారీరక వ్యాయామము, కేవలం కొన్ని శారీరిక కదలికలు ,ఇంకా శ్వాస పక్రియ అని మాత్రమే అనుకుంటారు. నిజానికి మానవుని అనంత మైన మేధాశక్తి , ఆత్మశక్తిల కలయికగా నిరూపితం అయ్యింది. మానవుల ఆరోగ్యాన్ని,శరీరాన్ని, మనసును అదుపులో పెట్టుకునేలా రూపొందించిన అద్భుత ప్రక్రియ యోగ. ఇది ఎంతో ప్రాచీన కాలం నాటిది. రుషుల సాధనతో యోగా ప్రక్రియను రూపొందించారు. ఇది ప్రపంచానికి భారతదేశం అందించిన మహత్తర ప్రక్రియ. యోగాతో మనిషి శరీరం, మనస్సు, ఆరోగ్యం అదుపులో ఉండగలవు. దీనిలోజ్ఞాన యోగము (తత్వశాస్త్రము ), భక్తి యోగము , రాజ యోగం మరియు కర్మ యోగములు ఉన్నాయి. యోగాసనాలు అంటే రాజయోగ పక్రియలో పైన చెప్పిన యోగాలన్నిటిలో సమతౌల్యాన్ని , ఏకత్వాన్ని తీసుకువస్తాయి. యోగా అనేది ఆరోగ్యకరమైన శక్తిని పుంజుకునే ఆనందకర మైన అనుభూతి. ఇది సులభమైన, కష్టతర మైన శ్వాసపక్రియతో కూడుకున్నటువంటి పక్రియ. దీనిద్వారా శారీరక , మానసిక సమతౌల్యం ఏర్పడు తుంది. ఇది ఒక బహుముఖ ప్రజ్ఞానాన్నికలిగించే కార్యక్రమం. ఇందులో యోగాసనాలు, శ్వాస పక్రియ, యోగాకి సంబంధించిన జ్ఞానము. ఇంకా ధ్యానము పొందుపరుచబడి ఉంటాయి. శరీరం సౌష్టవంగా ఉండేందకు కూడా యోగా ఉపయోగపడుతుందిం. ఇది నేర్చుకునే విద్యార్థులకు తమను తాము ఇంటి వద్ద నే చేసుకోవచ్చు. ఇది క్రొతగా నేర్చుకునేవారికి,రోజు సాధన చేసుకునేవారికీ అన్నిరకముల వయసుల వారికి ఉపయోగ పడుతుంది. చేసేవారి జీవన విధానములో ఎన్నో గొప్ప మార్పులు చోటుచేసుకున్నాయి. దీర్ఘ కాలికమైన అనారోగ్యాల నుండి బయట పడ్డారు. నెర్చుకునే వ్యక్తులు వారి అనుభూతులని వివవరించారు. వారు ఎంతో సంతోషంగా, ఆతురత తగ్గి,ఓర్పు పెరిగి,కుశల బుద్ధి కలిగి, పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. యోగాలో ఉన్న అద్భుత మేమంటే యోగాసనాలు శరీరానికి ధృడత్వాన్ని, శక్తిని ఇస్తాయి. అందుకే పెద్దవారైన, చిన్నవారైన, ధృడంగాఉన్నవారైన,లేనివారైన ఆసనాలు వేయడానికి ఇష్టపడతారు. సాధన చేస్తున్న కొద్ది ఆసనాల వెనకాల ఉన్న అంతరార్థం బాగా అవగాహనకు వస్తుంది. ఆసనంలో ఉంటూనే బాహ్య కరమైన శారీరక క్రమం నుంచి అంతరంగిక పరివక్రుత అనుభూతిలోకి వస్తుంది. యోగ ద్వారా గర్భిణుల ఆరోగ్యం కుదుట పడి, టెన్షన్ల నుంచి బటపడుతున్న తీరు చూస్తున్నాం. అలాగే ఎన్నోరకాల మానసిక రుగ్మతలకు యోగా ద్వారా పరిష్కారం దక్కుతోంది. యోగ మన జీవితంలోని అంతర్భాగమే. యోగ అనేది ఒక్కొక్క రకంగా అర్థమవుతుంది. యోగాలో ప్రధానమైనది ప్రాణాయామం. అనగా ఒకరి శ్వాస మీద పట్టు సాధించడం. ఇంకా శ్వాసను పీల్చే శక్తిని పెంచడం. సరైన శ్వాస పక్రియ శరీరంలోని అధిక ప్రాణవాయువును రక్తంలోనికి, మెదడులోనికి ప్రసరింపచేసి ప్రనసక్తిని పెంపొందిస్తుంది. ప్రాణాయామం అనేక యోగాసనాలు వేయటంలో దోహదపడుతుంది. ఈ రెండింటి సమ్మేళనము ప్రాణాయామం. యోగాసనాలు శరీరానికి మనస్సుకు స్వత్చతను, వ్యక్తిగత అనుసాసనాన్ని ఇస్తాయి. ప్రాణాయామం మెళకువ మనలను లోతైన లేదా ఘాఢమైన ధ్యానములోనికి తీసుకువెళుతుంది. అందుకే విధిగా అంతా యోగాను అలవాటు చేసుకుంటే ఉత్తమమైన జీవన విధానం అలవడుతుంది.

# సర్వ రోగ నివారిణి యోగా

మానసిక శారీరక ప్రశాంతత కు దివ్య ఔషధం యోగ నడక, ఈత కొట్టడం, రన్నింగ్ ఇవన్నీ వ్యాయామం క్రిందకే వస్తాయి. వీటి ప్రక్రియలో భాగంగానే యోగాను చూడాలంటున్నారు కొందరు వైద్య ఆరోగ్య నిపుణులు.క్రీస్తు పూర్వం 100 %-% 500 శకం మధ్య కాలంలో యోగాన్ని శాస్త్రీయంగా క్రోడీకరించినట్లు పరిశోధకులు అంచనా వేస్తున్నారు. దీనికి ఆద్యుడు పతంజలి.ఒకప్పుడు మానవులు శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు. వాస్తవానికి శారీరక శ్రమ చేసే వారికి ప్రత్యేకంగా ఎటువంటి వ్యాయామాలు అవసరం లేదు. ఆధునిక కాలంలో మనుషులు చేసే పనులనే యంత్రాలు చేస్తున్నాయి.మనం నిర్వహించే పనులలో టెక్నాలజీ పెరిగింది. దీనితో కొంత శారీరక శ్రమ తగ్గింది. అదే విధంగా మన ఆహార అలవాట్లు కూడా మారుతున్నాయి. జంక్ ఫుడ్ తినే వారి సంఖ్య పెరిగింది. పనిలో వేగం పెరగడం వల్ల మనిషి ఒత్తిడికి గురౌతున్నాడు. దీనితో వ్యాయామం యొక్క ఆవశ్యకత పెరిగింది. ఇందుకు వయసును బట్టి వివిధ రకాల వ్యాయామాలు చేయవచ్చు. కాలి నడక కూడా ఓ మంచి వ్యాయామమే. అదే విధంగా సైకిల్ తొక్కడం కూడా.యోగా కూడా ఒక వ్యాయామమే.ప్రపంచవ్యాప్తంగా మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవం 2015 జూన్ 21న నిర్వహించారు. భారతదేశంలో ప్రధాని నరేంద్ర మోడీ న్యూఢిల్లీలోని రాజ్‌పథ్‌లో నిర్వహించారు. ఆ వేడుకలకు చాలా దేశాలకు చెందిన నేతలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. 84 దేశాల నుంచి వచ్చిన నేతలతో పాటు మొత్తం 35,985 మంది యోగా చేసి రెండు గిన్నిస్ రికార్డులను నెలకొల్పారు.అప్పటి నుండి ప్రతి సంవత్సరం భారతదేశంలోని, ప్రపంచంలోని నగరాల్లో ఇలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి.యోగ అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని, శ్వాస వ్యాయామాలతో కూడుకుని, మనుషులలో ఉన్నటువంటి ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి, వారిని నిరాశ, నిస్పృహల నుండి బయటకు తీసుకురావడానికి ఉపయోగపడుతుందనీ యోగాగురువులు చెబు తున్నారు.యోగాసనాలు శరీరానికి ధృడత్వాన్ని,శక్తిని ఇస్తాయని వారు అంటున్నారు . అందుకే పెద్దవారైన, చిన్నవారైన, ధృడంగాఉన్నవారైన,లేనివారైన ఆసనాలు వేయడానికి ఇష్టపడతారు. సాధనచేస్తున్న కొద్ది ఆసనాల వెనకాల ఉన్న అంతరార్థం బాగా అవగాహనకు వస్తుందని వారు అంటున్నారు.ప్రతి సంవత్సరం, అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యకలాపాలను ఒక నిర్దిష్ట అంశం




సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

చుట్టూ కేంద్రీకరించడానికి ఒక నిర్దిష్ట థీమ్ ను తీసుకుంటారు. 2025 సంవత్సరానికి అంతర్జాతీయ యోగా దినోత్సవం థీమ్ "యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్"అయితే యోగా సర్వ రోగనివారిణి కాదు.ఎందుకంటే ఏ విధానానికి అయినా కొన్ని పరిమితులు ఉంటాయి.నిపుణుల సలహాలు లేకుండా కొన్ని ఆసనాలు వేయడం ఆరోగ్య రీత్యా అంత మంచిది కాదు.కాబట్టి నిపుణుల సలహాలతోనే యోగాసనాలు వేయాలి.దీనికి మతంతో, వర్గంతో సంబంధం లేదు.యోగా ప్రాచీన భారతీయ వారసత్వ సంపద. కాలంతో పాటు ఏ విధానంలో నైనా మార్పులు వస్తాయి. యోగాలో కూడా మార్పులు వస్తున్నాయి. ఇప్పుడు ఫిజియో థెరపీ బాగా అభివృద్ధి చెందింది. యోగాను కూడా ఇందులో భాగం చేసుకొని ఆచరించవచ్చు.యోగ చేద్దాం ఆరోగ్యం గా ఉందాం

**కామిడి సతీష్ రెడ్డి ములుగు పల్లి ఉన్నత పాఠశాల భూపాల్ పల్లి జిల్లా**

**జూన్ 21-అంతర్జాతీయ యోగా దినోత్సవం**

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
## మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి రాష్ట్ర పాడి పరిశ్రమ,పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు యువజనల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ గత 10 సంవత్సరాల నుంచి మక్తల్ నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా నిర్మించలేదని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలకు అమాయక ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకున్న బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తామని ఇంటికి అల్లుడు వస్తే ఏడ పండుకుంటాడని చెప్పిన మీరు ఒక్క డబుల్ బెడ్ రూమ్ అన్న కట్టించారని అన్నారు.ప్రజపాలన కాంగ్రెస్ ప్రభుత్వం మక్తల్ నియోజకవర్గానికి 3500 ఇండ్లకు 175 కోట్ల రూపాయలు కేటాయించామని అన్నారు. ఒక్కొక్క ఇంటికి 5 లక్షల రూపాయలు చొప్పున ఇస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 6 లక్షల రూపాయలు చొప్పున ఇస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సింగల్ చాయ్ తాగకుండా ఇందిరమ్మ ఇళ్ళ ప్రోసిడింగ్ పత్రాలను ఇస్తున్నామని అన్నారు. అమరచింత మండలానికి 241 ఇళ్ళు మంజూరు చేశామని అన్నారు. అమరచింత పట్టణానికి 85 ఇళ్ళు మంజూరు చేశామని అన్నారు. ఇళ్ళు మంజూరు అయిన వారందరు బేస్మెంట్ వేసుకుంటే లక్ష రూపాయలు గోడలకు,లక్ష రూపాయలు చొప్పున దశలవారీగా హౌసింగ్ అధికారులు బిల్లులు చెల్లిస్తారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులకు ఇసుక ఉచితం. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు 12 ట్రిప్పుల ఇసుకను ఉచితంగా ఇస్తున్నామని మంత్రి అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పి. డి. విఠోబా, తహసీల్దార్ రవి కుమార్, మున్సిపల్ కమిషనర్ శశిధర్, ఎంపీడీవో చెన్నమ్మ, ఎంపీ ఓ నరసింహయ్య, ఏవో అరవింద్, కల్లు గీత కార్మిక సంఘ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఎం. అయూబ్ ఖాన్,మండల అధ్యక్షుడు కొత్తగౌని మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్, మాజీ ఎంపిటిసిలు పి.తిరుమలేష్, మహంకాళి విష్ణు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పోసిరి గారి విష్ణు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు హనుమంతు నాయక్, తోఫిక్, దేవరకొండ మోహన్, మాలే గౌండ్ల రాకేష్ గౌడ్, శ్యామ్, ప్రకాశం, హరీష్ నాయక్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఎన్నికైన... గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## బిజెపి రాష్ట్ర నాయకులు బి.కొండయ్య

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ..**

**నారాయణ పేట జిల్లా**

దేశ రక్షణ ప్రధాని నరేంద్ర మోడీ తోనే సాధ్యమని అలాగే ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన సాధించిన అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా బిజెపి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని రాష్ట్ర నాయకుడు బి కొండయ్య పిలుపు నిచ్చారు.కృష్ణ,మాగనూర్ ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లె నర్సప్ప అధ్యకతన శు క్రవారం కృష్ణ మండల కేంద్రంలోని వివేకానంద స్వామి భవనంలో జరిగిన ఉమ్మడి మండలాల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతు ప్రధాని మోడీ దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలుపుతున్నారని అన్నారు.అగ్రరాజ్యం అధినేత ఎన్ని ప్రగల్బాలు పలికిన చివరికి పాకిస్తాన్ భారత్ యుద్ధం ఆపడంలో తన పాత్ర ఏమి లేదని ఒప్పించాడనీ అన్నారు.ఈ రాష్ట్ర ప్రభుత్వ వైఫాల్యాలను ఎండగట్టి ఏ ఎన్నిక అయినా బిజెపి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలనీ అన్నారు.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ ల గారడితో 6 అబద్ధాలు 66 మోసాలతో అధికారంలోకి వచ్చిందన్నారు.రైతు రుణ మాఫి పూర్తి కాలేదు,ఏడాది అయినా రైతు బరోసా పూర్తిగా లేదని,మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేశారని అన్నారు.అలాగే గృహజ్యోతితో మహిళలను మోసం చేశారని,వృద్ధులకు చేయూత అందించలేదని, యువత వికాసం మరిచారని సొంతిల్లు కలగానే మిగిలి పోయిందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు రోడ్డున పడ్డారనీ అన్నారు.బి ఆర్ ఎస్,కాంగ్రెస్ దోచుకోవడం లో రెండు పార్టీలు ఒక్కటేనని, అంతే కాకుండా పదేళ్లు బి ఆర్ ఎస్ కే.ట్యాక్స్ ఇప్పుడు కాంగ్రెస్ ఆర్ ఆర్ ట్యాక్స్ చెల్లిస్తున్నదని విమర్శించారు. అలాగే ప్రజాస్వామ్యాన్ని పాతర వేశారని ప్రజలు వీరి పాలనలో భూమి, ఇళ్లు కోల్పోయారని.రాష్ట్రాన్ని అప్పుల కుప్పలు చేశారని అన్నారు. బి. కొండయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్ కా వికాస్,సబ్ కా విశ్వాస్ నినాదంతో చేపట్టిన సంక్షేమ పథకాలను,వక్ఫ్ బోర్డు రద్దుతో ముస్లింలకు ఏమి నష్టం లేదన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని బిజెపి గెలుపుకు పట్టుదలతో కృషి చేయాలని అన్నారు. ఆపరేషన్ సిందూర తో ప్రధాని నరేంద్రమోడీ పాకిస్తాన్ కు బుద్ధి చెప్పడమే కాకుండా ప్రపంచ దేశాల్లో ఏకాకిని చేశారని అన్నారు.కరోనా నాటి నుంచి పేదలు ఆకలితో అలమటించే పరిస్తిని దూరం చేస్తూ ఉచితంగా ప్రతి ఒక్కరికీ 5 కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నారని అన్నారు. అంతే కాకుండా అనేక రంగాల్లో అభివృద్ధి నీ సాధించారని అన్నారు.వాటిని ప్రజలకు వివరిస్తూ సంస్థగతంగా పార్టీని మరింత పటిష్టం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరోల రవి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ గౌడ్,విద్యాసాగర్ ప్రబారి కర్నే స్వామి,మాజీ ఎంపీపీ శ్యామలమ్మ,మాజీ మండల అధ్యక్షులు మజ్జిగ సురేష్,జయనంద్ రెడ్డి, నారాయణ, శ్రీనివాసులు, హుస్సేనప్ప, కనకరాజు, బాల్చేడు మల్లికార్జున్, లక్ష్మణ్, ప్రతాపరెడ్డి,తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు,

.ఈ సమావేశంల ఉమ్మడి మండల నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులుగా నల్లెనర్సప్ప, ప్రధాన కార్యదర్శిగా అశోక్ గౌడ్ దండు రాఘవేంద్ర కరిమెని తిమ్మప్ప ఉపాధ్యక్షులుగా రాంగోపాల్ శెట్టి వడ్ల మారెప్ప లింగప్ప డీకే ప్రమీల కార్యదర్శులుగా భీమేష్ జగ్గిలి సుశీలమ్మ వాకిటి స్వప్న వెంకట్ రెడ్డి గౌడ కోశాధికారిగా ప్రకాష్ శెట్టి తోపాటు 35 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో 54 మంది బూత్ అధ్యక్షులు సీనియర్ నాయకులు గ్రామ మండల జిల్లా రాష్ట్ర స్థాయి నాయకులు మరియు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు




# చేయూత పింఛన్లు పేదలకు కనీస అవసరాల తీరుస్తాయి

## అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, జూన్ 20.**

పేదల అభ్యున్నతికి చేయూత పింఛన్లు ఎంతో ఉపయోగపడతాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో చేయూత పింఛన్లపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు సమయానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న వారిలో ఎవరైనా మరణించినట్లయితే, వారి కుటుంబ సభ్యులకు వెంటనే పింఛన్లను మళ్లించాల్సిందిగా సూచించారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, నిధులు విడుదలైన వెంటనే పింఛన్ల చెల్లింపులు జరగాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు తగిన బాధ్యతతో వ్యవహరించాలని, పింఛన్లు ఇచ్చే ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని, అర్హులైన పింఛన్దారుల వివరాలను పకడ్బందీగా పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (సోషల్ సెక్యూరిటీస్-పెన్షన్స్) గోపాలరావు, ఐకెపి ఎడిసి చరణ్ దాస్, డిపిఓ శ్రీనివాస్, డిపిఎం శోభ, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# భర్త హత్య కేసులో భార్య, ఇద్దరి నిందితులకు జీవిత ఖైదు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రెండో భార్యకు ఆస్తి దక్కకుండా చేయాలని దురుద్దేశంతో భర్త రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం సేవాలాల్ (55) హత్యకు కారణమైన మొదటి భార్య దరంసోత్ సరోజతో పాటుగా మరో ఇద్దరు నిందుతులు ఆమె తమ్ముడైన బానోతు శ్రీనివాస్, చెల్లెలు తేజావత్ లక్ష్మి లకు జీవిత ఖైదు, ఒక్కక్కరికి 2000 రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి నీరజ తీర్పు వెల్లడించినట్లుగా శుక్రవారం జిల్లా ఎస్పీ మహేష్ గీతే తో పాటు స్థానిక ఎస్సై చిందం గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు.



# ఓమాన్ నుంచి మృతదేహాన్ని తెప్పించాలని

## 'ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించిన బాధిత కుటుంబం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

నిజామాబాద్ బాల్కొండ నియోజకవర్గం జిల్లా కమ్మర్పల్లి మండలం హాస కొత్తూరు కు చెందిన జుంబారత్ అన్వేష్ (27) ఓమాన్ దేశం లోని బురైమి లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడగా, అన్వేష్ మృతదేహాన్ని త్వరగా ఇండియాకు తెప్పించాలని మృతుని సోదరుడు హరీష్ శు క్రవారం హైదరాబాద్, మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లోని 'ప్రవాసీ ప్రజావాణి' లో మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ మంద భీంరెడ్డి లతో కలిసి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.



జి.చిన్నారెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ వి.శేషాద్రి తో మాట్లాడారు. మస్కట్ లోని ఇండియన్ ఎంబసీతో సంప్రదించి మృతదేహాన్ని తెప్పించాలని కోరారు.

# వసతి గృహం విద్యార్థులకు పాఠశాల బస్సు సౌకర్యం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో గల, వెనుకబడిన తరగతుల బాలుర సమీకృత వసతి గృహ విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పించినట్లుగా శుక్రవారం మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను చేరడానికి విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న విషయాన్ని, రవాణా సౌకర్యంతో పరిష్కరించినట్లుగా వివరించారు.

# ఇప్పటిదాకా 1,17,858 మంది అన్నదాతలకు రైతు భరోసా

## రూ.120 కోట్ల లబ్ధి.. రైతు కళ్ళల్లో ఆనందం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నది. ఇప్పటికే రుణమాఫీ చేయగా.. సన్నాలకు బోనస్ అందిస్తున్నది. అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నది. ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సిద్ధమవుతుండగా.. రాష్ట్ర సర్కార్ ఆర్థికంగా భరోసాగా నిలుస్తున్నది. అన్నదాతలకు అండగా..ప్రజా ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తూ పలు పథకాలు అమలు చేస్తున్నది. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్లో 1,87,660 ఎకరాల్లో వరి, 51,460 ఎకరాల్లో పత్తి, 1,600 ఎకరాల్లో మొక్క జొన్న, 1,155 ఎకరాల్లో కందులు తదితర పంటలు కలిపి 2,48,273 ఎకరాల్లో ఆయా పంటలు సాగు చేసేందుకు సమాయాత్తమవుతున్నారు. ఖరీఫ్ పంటలు సాగు ఆర్థిక అవసరాలు తీర్చేందుకు రైతు భరోసా కింద అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ చేస్తున్నది. జిల్లాలోని మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నది. నకిలీ విత్తనాల నివారణకు దాడులు చేయిస్తున్నది. 6,645 మెట్రిక్ టన్నుల యూరియాను.. అలాగే విత్తనాలు అందుబాటులో పెట్టింది.లిరైతులకు రూ. 370 కోట్ల రుణమాఫీ..సాగులో నూతన పద్ధతులు, ఆధునిక యంత్రాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు ముగింట్లో శాస్త్రవేత్తల పేరిట కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పటికే 46,535 మంది రైతులకు 370 కోట్ల 86 లక్షల రుణ మాఫీ చేసిందిలిముందస్తుగానే కొనుగోళ్లు పూర్తి..రైతుల ఆరుగాలం కష్టం ప్రకృతి వైపరిత్యాలతో దెబ్బతిని నష్టపోవద్దనే ఉద్దేశంతో జిల్లాలో ముందస్తుగానే 244 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం 44,767 మంది రైతుల నుంచి రూ.624 కోట్ల విలువైనది సేకరించారు. లిఎలాంటి పరిమితులు విధించకుండా..జిల్లాలోని 13 మండలాల్లోని 1,17,858 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో 119,46,81,630 రూపాయల నిధులు విజయవంతంగా జమయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. పాత రైతులతో పాటు కొత్త రైతులకు కూడా రైతు భరోసాను ఎలాంటి పరిమితులు విధించకుండా అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. లిరైతు భరోసా పడింది.. రుణమాఫీ అయింది..– లిషేరి స్వామి, హన్మాజీపేట, వేములవాడ రూరల్ మండలంనాకు రెండు ఎకరాల 17 గుంటల భూమి ఉన్నది. ఖరీఫ్ సాగు కోసం పనులు చేసుకుంటున్న. రాష్ట్ర ప్రభుత్వం నా బ్యాంక్ ఖాతాలో రూ. 14,550 వేలు జమ చేసింది. అలాగే నాకు ఇటీవల రూ. ఒక లక్ష 50 వేల రుణమాఫీ అయింది. నాకు ఆర్థికంగా మద్దతుగా నిలిచిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు కృతజ్ఞతలు. ఎరువులు.. విత్తనాలకు వాడుతాము..– లినాగండ్ల సుజాత, నిమ్మపల్లి, కోనరావుపేట మండలం.నాకు ఒక ఎకరం 22 గుంటల భూమి ఉంది. ప్రజా ప్రభుత్వం నా బ్యాంక్ ఖాతాలో రూ. 9300 జమ చేసింది. ఇప్పుడు పంటలకు అవసరమైన ఎరువులు, వితనాల కోసం వీటిని వాడుతాము. ఈ సీజన్ లో ఉపయోగపడేలా డబ్బులు వేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపారు.




# చిత్రకారుడిగా బంగారు భవిష్యత్తు ఉంది

## ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

చిత్రకారుడిగా నవీకాంత్ కు బంగారు భవిష్యత్తు ఉందని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు ఎమ్మెల్సీ అంజిరెడ్డి జన్మదిన సందర్భంగా నవీకాంత్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి చిత్రపటాన్ని రామచంద్రాపురం లో తన తల్లితండ్రులైన భాగ్యశ్రీ లక్ష్మీకాంత్ తో కలిసి బహూకరించాడు తన చిత్రపటాన్ని చూసిన అంజిరెడ్డి అచ్చు తనలాగే ఉండడం చూసి బాలుడిని అభినందించారు 9 వ తరగతి చదువుచున్న బాలుడు నవీకాంత్ కు చిత్రకారుడిగా మంచి భవిష్యత్తు ఉందని అన్నారు చిత్రకారుడిగా బాలుడి ప్రతిభను అంజిరెడ్డి దంపతులు కొనియాడారు



# నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

## ఇద్దరు నిందితుల అరెస్ట్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్, వ్యవసాయ అధికారి జి కిరణ్మయి లు మాట్లాడుతూ ఈనెల 20వ తారీకున ఉదయం కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేని నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా రైతులకు విక్రయించడానికి ప్రయత్నిస్తునారన్న సమాచారం అందిన వెంటనే పోలీసు సిబ్బంది, మండల వ్యవసాయ అధికారి జి కిరణ్మయి, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి బృందం కలిసి ఊరు మందమర్రి మినీ ట్యాంక్ బండ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై వెళు_న్న ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేయడంతో వారి వద్ద ఎలాంటి పత్రాలు, బిల్లులు, లేబుల్స్ లేని 40 కిలోల నకిలీ పత్తి విత్తనాల బస్తాను పట్టుకోవడం జరిగిందని, నకిలీ విత్తనాల విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని తెలిపారు. నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడిన నిందితులను మందమర్రి మండలం బురదగూడెం గ్రామానికి చెందిన ముచ్చ గౌతమ్, ముంద్రు మణి గా గుర్తించామని విచారణలో వారు ఈ విత్తనాలను ఆంధ్రప్రదేశ్ కు చెందిన వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు అంగీకరించారని అన్నారు. మండల వ్యవసాయ అధికారి జి కిరణ్మయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. రైతులు ఈ సూచనలు పాటించాలని పత్తి విత్తనాలను ప్రభుత్వం గుర్తించిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, విత్తన ప్యాకెట్పై లాట్ నంబర్ కాలపరిమితి వంటి వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలని, ఎవరైనా తక్కువ ధరకు లూజు విత్తనాలు అమ్ముతామని వస్తే వారిని నమ్మవద్దని అన్నారు. ఎవరిపై అయినా అనుమానం వస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.



# ప్రణాళికాబద్ధంగా సాకి చెరువు అభివృద్ధి

## ఎమ్మెల్యే జిఎంఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువును ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7 కోట్ల రూపాయలతో చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు పటాన్చెరు పట్టణ ప్రజల కోసం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి మత్స్యకార సహకార సంఘం ప్రతినిధులు ముదిరాజ్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# నేడు పటాన్చెరులో ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో యోగా డే వేడుకలు


## భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపు

## పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఒక్కరికి యోగా ప్రాముఖ్యత తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో నేడు పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో యోగ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు శుక్రవారం సాయంత్రం మైత్రి మైదానంలో యోగా డే వేడుకల ఏర్పాట్లు పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచమంతా పరిపూర్ణ ఆరోగ్యంతో విశ్వశాంతితో ముందుకు సాగాలన్నదే యోగ దినోత్సవ ఉద్దేశమని తెలిపారు విశ్వవ్యాప్తంగా వివిధ దేశాల ప్రజలు యోగ విశిష్టతను తెలుసుకొని ప్రతిరోజు యోగ సాధన చేస్తున్నారని తెలిపారు యోగ మార్గం ఆవిష్కృతమైన భారతదేశంలో ప్రజలందరూ యోగ సాధన చేసి పరిపూర్ణమైన ఆరోగ్యం పొందాలని కోరారు యోగ వేడుకలకు వచ్చే ప్రతి ఒక్కరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు మహర్షి పతంజలి సంస్థ శిక్షకుల ఆధ్వర్యంలో యోగ విన్యాసాలు చేయడమవుతుందని తెలిపారు

శనివారం ఉదయం ఏడు గంటల నుండి 9 గంటల వరకు యోగా వేడుకలు జరుగుతాయని తెలిపారు పటాన్చెరు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు అధికారులు అనధికారులు ప్రజా ప్రతినిధులు యువకులు కార్మికులు మహిళలు విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు




# ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**సమయజ్యోతి న్యూస్ జూన్ 20 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండల కేంద్రంలో లోని ఆదర్శ పాఠశాలలో హావర్లి బేస్డ్ టీచింగ్ దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు టీ జి టి హిందీ కి డిగ్రీ బీ .ఎడ్ ,హెచ్. పి .టీ .టెట్ అర్హత అలాగే ఆంగ్లం కు పి .జి .టి ఎం ఎ ఇంగ్లీష్ తో పాటు బి. ఎడ్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు చివరి తేదీ ఈ నెల 26 వరకు డెమో నిర్తహించడం ద్వార ఎంపిక చేస్తామని ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు.

# పాఠశాల స్థాయిలోనే యోగాకు ప్రణాళిక రావాలి

## పిల్లలకు యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభ్యం

## ఆరోగ్యకరమైన సమాజానికి ఇది ఎంతో అవసరం

న్యూఢిల్లీ,జూన్20(సమయజ్యోతి):

ఆరోగ్యవంతమైన సమాజం కోసం పాఠశాలస్థాయి నుంచే యోగాను అలవాటు చేయాలన్న డిమాండ్ ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఇప్పుడిప్పుడే దీనిని ఓ క్లాస్‌గా గుర్తించి అలవాటు చేస్తున్నారు. సరస్వతీ శిశుమందిర్ లాంటి వాటిలో ఇది తప్పనిసరిగా ఉంటోంది. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. ఆట పాటలు, యోగాసనాలతో పిల్లల్లో మానసిక ఆరోగ్యం నింపేందుకు ముందుకు రావాల్సి ఉంది. క్రీడాంశాల్లో యోగగాను జోడించి అనేక ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ప్రతి ఏటా విద్యాశాఖ ఉపాధ్యాయులకు పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు అవసరమైన వృత్తి నైపుణ్యాలను అందిస్తోంది. ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి మారిన పాఠ్యాంశాల ఆధారంగా బోధన తీరు మెరుగపడేలా చర్యలు తీసుకుంటుంది. ఎన్నో ఏళ్లుగా వ్యాయామ ఉపాధ్యాయులకు ఎలాంటి శిక్షణ తరగతులు లేవు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థుల ఆరోగ్యం, ఇతర అంశాలపై దృష్టిసారించలేక పోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన విద్యాశాఖ వ్యాయామ ఉపాధ్యాయులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించింది. యోగా, ఆరోగ్యం, కరాటే, మానసిక అంశాలపై తర్ఫీదునిచ్చారు. విద్యార్థులకు ఆత్మస్థైర్యం పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు కరవయ్యాయి. ప్రార్థన చేసేందుకు స్థలం కొరత పీడిస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఏడాదిలో స్వాతంత్య, గణతంత్య వేడుకల సమయంలో తప్ప క్రీడా పోటీలు ఊసేలేదు. ఆసక్తి ఉన్నా విద్యార్థుల్లో ప్రతిభ కనుమరుగవుతోంది. అప్పుడప్పుడు మండల, జిల్లా స్థాయి పోటీలకు తప్ప రాష్ట్ర, దేశ స్థాయిలో గుర్తింపు కరవైంది. సగానికిపైగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుగా దర్శనమిస్తున్నాయి.



ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రాధాన్యం లేక నిరాశకు గురవుతున్నారు. ఇన్నాళ్లుగా ఈ అంశాలకు దూరమైన పిల్లలకు సంపూర్ణత చేకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మానసిక వికాసం, శరీర దారుఢ్యంతోపాటు మెదడు చురుకుదనంతో ఉండేలా సమగ్ర నిరంతర మూల్యాంకనం విధానంలో భాగంగా వ్యాయామ విద్యను తప్పనిసరిగా అమలు చేయాలని నిర్ణయించారు. యోగా, ఆత్మరక్షణ కోసం కరాటే, క్రీడలు, ఆర్యోగంతో సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తు ను చక్కదిద్దుకుంటారు. ఆటలతోపాటు వ్యక్తిగత ఆరోగ్య పాఠాలు బోధించాలి. క్రీడల్లో ఉత్తేజపూరితంగా తర్ఫీదు ఇచ్చేలా శిక్షణ ఇవ్వాలి.. ప్రతి రోజు వ్యాయామ, ఆరోగ్య విద్యను అమలు చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలి. యోగాకు ప్రతి రోజు ఓ పీరియడ్ కేటాయించాలని సూచిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రోజువారీగా నిర్ణయించిన ప్రణాళికను అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలి. క్రీడా మైదానాలను సిద్ధం చేయాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్న డిమాండ్లు ఉన్నాయి. ఇతర దేశాల్లో బాల్య దశలోనే ఆరోగ్యం, మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్నారు. మన దగ్గర ఆటలాడు కోవాలనే ఆసక్తి ఉన్నా ఆట స్థలం కరువే...ప్రతిభ ఉన్నా శిక్షకుడి సేవలు దూరమే...ఎలాంటి శిక్షణ లేకున్నా ఏకలవ్యులా పలు పోటీల్లో విద్యార్థులు సత్తాచాటుతున్నారు. సగానికిపైగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ...మరికొన్నిటికి పోస్టుల మంజూరు లేదు...విద్యార్థుల్లో మానసిక పరిపక్వత లోపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు ఆందోళన కల్గిస్తున్నాయి. క్రీడా మైదానాలు లేని చోట సమీపంలో అందుబాటు లో ఉన్న స్థలాలను ఎంపిక చేసుకుని తీసుకోవాలి. సగానికిపైగా ఖాళీలు ఉండటంతో వీటిని భర్తీ చేయాలి. క్రీడాకారుల ప్రయోజనం కోసం ఆట వస్తువులు, ఇతర వసతులు కోసం నిధులను కేటాయించాలి. విద్యాక మిటీ సభ్యులను భాగస్వాములను చేసి ప్రజా విరాళాలతో ముందుకుసాగేలా ప్రతిపాదనలు తయారు చేసుకోవాలి. ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ విద్య అమలు చేస్తున్నప్పటికీ ప్రాథమికస్థాయిలో లేకపోవడం అన్యాయమే. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను పకడ్బందీగా అమలు చేస్తుండగా ప్రైవేటు పాఠశాలల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకమే. పలు పాఠశాలలకు క్రీడా వసతులు లేవు. పాఠశాలల గుర్తింపునకు ముందు కనీస వసతులు ఉంటేనే అనుమతి పత్రం ఇవ్వాలి. నిబంధనలు పాటించకుండానే అనుమతులు ఇవ్వడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రార్థన చేసుకునేందుకూ స్థలం లేకపోవడం గమనార్హం. ప్రైవేటు పాఠశాలల్లో కూడా వ్యాయమ విద్య పక్కాగా అమలు చేస్తే క్రీడా వెలుగులు అందుతాయి.

# మన నేరెళ్లను మనమే మరిచామా?

## - మిమిక్రీ కళకు ప్రాణం పోసిన వేణుమాధవ్

## -ప్రపంచానికి ప్రతిభను చాటిన మహనీయుడు

వరంగల్,జూన్20(సమయజ్యోతి):

మిమిక్రీ అనే కళను ప్రపంచానికి పరిచయం చేసి, దానిని ఐక్యరాజ్య సమితి వరకు తీసుకెళ్లిన ధీశాలి మన నేరెళ్ల వేణుమాధవ్ ధన్యజీవి. అంతటి మహానుభావుడు ఓ సామాన్యుడిలా మన కళ్లముందే నడయాడి మనలను వీడి వెళ్లారు. జూన్ 19న ఆయన వర్ధంతి. అయితే 19న పెద్దగా ఆయనను ఎవరూ పట్టించుకోలేదు. స్మరించుకోలేదు. ఆయన ప్రేమించి, ప్రవచించిన మిమిక్రీని సజీవంగా మనకందించారు. మిమిక్రీ ఉన్నన్నాళ్లూ నేరెళ్ల వేణుమాధవ్ మనకు సాక్షాత్కరిస్తూనే ఉంటారు. వరంగల్ నుంచి ప్రారంభమైన నేరెళ్ల వేణుమాధవ్ మిమిక్రీ ప్రస్థానం ఐరాస వరకు వెళ్లిందంటే తెలుగువారిగా మనకన్న గర్వించేవారు ఉండరు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాలంలోనే అమెరికాలో ప్రదర్శనకు అవకాశం రావడంతో ఆయన పేరు దేశ వ్యాప్తంగా మార్మోగినప్పుడు తెలుగువారి గుండెలు మరింత పులకించి ఉంటాయి. ఆనాటి ఘటనలు తలుచుకుంటే నేటికీ మనం పులకించకుండా ఉండలేం. ఓ కళను సృష్టించిన స్రష్ట ఆయన. దానిని శబ్దప్రక్రియగా ఓ సబ్జక్టుగా రూపొందించి భావి తరాలకు మార్గం చూపారు. అయినా పురాణాల్లోనే ఇలాంటి చాతుర్యం ఉందని, అదంత భగవత్ కృప అని చెప్పుకుని, తన గొప్పతనమేమీ లేదని చెప్పుకోవడం ఆయన ఉదాత్తకు తార్కాణం. తనకు అబ్బిన మిమిక్రీ కళను ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 దేశాల్లో ప్రదర్శనలుగా ఇవ్వడం ఒక ఎత్తయితే 1971లో ఐక్యరాజ్య సమితిలో ప్రపంచ ప్రముఖుల గొంతులను అనుకరించి ప్రపంచం దృష్టినీ ఆకర్షించడం మరొక ఎత్తు. తన గొంతులో వెయ్యి గొంతుకలను పలికించడం ద్వారా మిమిక్రీ కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కళాకారుడు తెలుగువాడయినందుకు... భారతీయుడైనందుకు మనమంతా గర్వపడాలి. పదో ఏటలోనే మిమిక్రీ కళపై మక్కువ పెంచుకున్న నేరెళ్ల తన ఆశయం మేరకు మిమిక్రీపైనే దృష్టి సారించి దానిని జగద్విఖ్యాతం చేయకుండా ఉండివుంటే ఇవాళ మిమిక్రీ అన్నది ప్రపంచానికి తెలిసేది కాదు. ఆయన జీవితం ఓ పాఠం. ఆధునిక తరానికి ఓ సక్సెస్ స్టోరీ. పోతన పుట్టిన ఓరుగల్లులో పుట్టిన మట్టిబిడ్డగా వేణుమాధవ్ తన గళం బలంతో ప్రపంచాన్ని శాసించారు. తొలితరం నటుడైన చిత్తూరు నాగయ్య స్వరాన్ని అనుకరించడం ద్వారా తన కళా ప్రస్థానానికి బాటలు వేసుకున్నది మొదలు ఆయన గొంతుకలో ఎందరి గొంతుకలు ఇమిడి పోయాయో చెప్పలేం. మహామహులే ఆయన గొంతుకకు పాదా క్రాంతులయ్యారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టినా..తనకు గుర్తింపు తెచ్చిన మిమిక్రీని మాత్రం వదలకుండా పెనవేసుకుని పోయారు. అలా మొదలైన ప్రస్థానం పది వేల ప్రదర్శనల వరకు కొనసాగిందంటే ఆయన పట్టుదల ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. మిమిక్రీకి ఏమాత్రం గుర్తింపు లేని రోజుల్లోనే ఆ కళపై మక్కువ పెంచుకుని దానికి అర్థం పరమార్థం చెప్పి ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి మన వేణు మాధవ్ ధన్యజీవి. ఆయన ప్రతిభాపాటవాలను గుర్తించిన భారత ప్రభుత్వం 2001లో పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. కాకతీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్లు ఇచ్చి సత్కరించాయి. వివిధ రాష్ట్రాల్లో ఆయన లెక్కలేనన్ని పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. తిరుపతిలో అభిమానుల నుంచి గజారోహణ సత్కారం అందుకున్నారు.



# యోగాతో... ఆరోగ్యమే మహా భాగ్యం

హైదరాబాద్,జూన్20(సమయజ్యోతి):

ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. శరీరం ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో సుఖం, సంతోషం, సమృద్ధి సాధ్యం. దీనికి ఆర్థిక ఆరోగ్యమూ ఎంతో ముఖ్యం. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. జూన్ 21, అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ప్రపంచమంతా ఏటా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. యోగాలో ఒక ఆసనాన్ని సాధన చేయాలంటే ఎంతో శ్రద్ధ, క్రమశిక్షణ అవసరం. ఒక్క రోజు సాధనతో పరిపూర్ణత రాదు. ఇది నిరంతర అభ్యాసం. ఇలా చేయడం వల్ల దీర్ఘకాలంలో గణనీయమైన ఆరోగ్యాన్ని సృష్టించవచ్చు. యోగా సాధనలో మనసు, శరీరం సమతుల్యంగా ఉండాలి. అప్పుడే ఆరోగ్యం సాధ్యం.యోగాలో ఒక ఆసనాన్ని పరిపూర్ణంగా చేయాలంటే ఓపిక అవసరం. ఒక్క రోజులోనే శరీరం ఆ ఆసనానికి అనువుగా మారదు. మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు యోగా, ధ్యానం ఎంతో తోడ్పడతాయి. కష్టమైన ఆసనాల్ని వేసినప్పుడు వచ్చిన సంతృప్తి, మనల్ని ధైర్యవంతులుగా మారుస్తుంది. అదే విధంగా మన మీద మనకు విశ్వాసం అవసరం. యోగా ఒత్తిడిని తగ్గించడంలో సాయం చేస్తుంది. ప్రాణాయామం, ధ్యానం వంటివి మనసును ప్రశాంతంగా ఉంచుతాయి. ఆర్థిక జీవితంలోనూ ఒత్తిడిని ఎదుర్కోవడం కీలకం. ఈ సమయంలో ప్రశాంతంగా ఆసనాలు వేయడం అవసరం.

# నగరంలోని పారామౌంట్ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్

## వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్టవేసిన విదేశీయులు

## 18మంది అక్రమంగా ఉంటున్నట్లు గుర్తించిన పోలీసులు

## వారిని డిపోర్ట్ చేస్తామని ప్రకటించిన సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ

హైదరాబాద్,జూన్20(సమయజ్యోతి):

హైదరాబాద్ నగరంలోని పారామౌంట్ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున పెద్దఎత్తున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది. అక్రమ చట్టవ్యతిరేక కార్యకలాపాలు, విదేశీయుల అక్రమ నివాసాలపై ఆధారంగా పోలీసులు ఈ ఆపరేషన్ చేపట్టారు. సుమారు 150 మంది పోలీసులు తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఈ కాలనీని చుట్టుముట్టి సోదాలు ప్రారంభించారు. లా అండ్ ఆర్డర్, టాస్క్ ఫోర్స్, హెచ్ఎన్‌యూ, ఏఆర్ విభాగాలకు చెందిన పోలీసులు ఈ తనిఖీలలో పాల్గొన్నారు. ఈ సెర్చ్‌లో నైజీరియా, ఇథియోపియా, కెన్యా, సోమాలియా దేశాలకు చెందిన వలసదారులు పెద్దఎత్తున ఉన్నట్లు గుర్తించారు. వీరిలో చాలామంది భారతదేశం వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా నివసిస్తూ ఇల్లీగల్ కార్యకలాపాల్లో భాగం అవుతున్నట్లు పోలీసుల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల్లో మొత్తం 18 మంది విదేశీయులు వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా జీవిస్తున్నట్లు గుర్తించారు. వారిని గుర్తించిన పోలీసులు త్వరలోనే డిపోర్ట్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సోదాల సందర్భంగా డాక్యుమెంట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 50కి పైగా బైకులు, 5 కార్లను పోలీసులు సీజ్ చేశారు. అంతేకాక, గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్న బెల్ట్ షాపులు, హుక్కా సెంటర్లను గుర్తించి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లు, గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. మద్యం అక్రమ నిల్వలు బయటపడటంతో, స్థానికంగా నడుస్తున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలపై మరింత దృష్టి పెట్టనుని పోలీసులు అన్నారు. ఈ సందర్భంగా సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ మాట్లాడుతూ, 'పారా మౌంట్ కాలనీలో కార్డన్ సెర్చ్‌తో పాటు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించాం. వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉండిపోయిన విదేశీయులను గుర్తించాం. వారి వివరాలు సేకరించి, త్వరలోనే డిపోర్ట్ చేయనున్నాం. మాదకద్రవ్యాల విషయంలో మేము చాలా సీరియస్‌గా ఉన్నాం. ఈ సెర్చ్‌లో డ్రగ్స్ లభించలేదు. కానీ భవిష్యత్‌లో ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌తో నగరంలోని ఇతర అనుమానస్పద ప్రాంతాల్లో కూడా ఇలాంటి తనిఖీలు జరపనున్నట్లు పోలీసులు సంకేతాలు ఇస్తున్నారు. విదేశీయుల పేరుతో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేందుకు ఇది ఒక ముందడుగుగా మారింది.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ డే

## మంత్రి అనగాని సత్యప్రసాద్

అమరావతి,జూన్20(సమయజ్యోతి):

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవెన్యూ దినోత్సవ వేడుకలకు సిద్ధమైంది.. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు నిర్వహించనుంది.. దీని కోసం జిల్లాకు 2 లక్షల రూపాయల చొప్పున రూ.52 లక్షలు రెవెన్యూ డేకు ప్రభుత్వం విడుదల చేసింది.. రెవెన్యూ డే సందర్భంగా ప్రతీ రెవెన్యూ జిల్లా కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నారు.. రెవెన్యూ ఉద్యోగుల బాధ్యతలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు జరగనున్నాయి.. రెవెన్యూ దినోత్సవ వేడుకలపై రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. రేపు జరిగే రెవెన్యూ దినోత్సవాన్ని జయప్రదం చేయండి అంటూ పిలుపునిచ్చారు.. ప్రతి ఏటా జూన్ 20వ తేదీన అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో రెవెన్యూ దినోత్సవాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.. ప్రజలకు, రైతులకు భూ సంబంధ అంశాలపై అవగాహన కల్పిస్తామని.. ప్రజలు, ప్రజాప్రతినిధుల నుండి సలహాలు స్వీకరిస్తామన్నారు.. ఇక, ఉత్తమ సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులకు ఈ సందర్భంగా సన్మానం చేస్తామని పేర్కొన్నారు.. బాగా పని చేసిన రెవెన్యూ ఉద్యోగులను గుర్తించి కమేండేషన్ సర్టిఫికేట్ జారీ చేస్తాం.. రెవెన్యూ దినోత్సవంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు.

# బెంగాల్‌లో లారీని ఢీకొన్న బొలెరీ వాహనం

## రోడ్డు ప్రమాదంలో 9మంది దుర్మరణం

కోల్‌కతా,జూన్20(సమయజ్యోతి):

పశ్చిమ బెంగాల్‌లోని పురులియా జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది మరణించారు. శుక్రవారం ఉదయం జాతీయ రహదారి-18పై నోమిషల్ గ్రామ సమీపంలో బొలెరో వాహనం.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారంతా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి వారిని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే వారంతా అప్పటికే మృతి చెందారని వైద్యులు వెల్లడించారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పురులియాలోని బారాబజార్ పోలీస్ స్టేషన్ పరిధి అడబానా గ్రామంలో జరిగిన వివాహానికి వీరంతా హాజరై.. కారులో తిరిగి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రం నిమ్డిహ్ సమీపంలోని తిలైతాండ్‌కు వారంతా వెళ్తున్నారని వివరించారు. అతి వేగంతోపాటు నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ప్రమాద వార్త తెలియగానే వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కొన్ని గంటల క్రితమే వీరంతా వివాహ వేడుకల్లో పాల్గొని.. సందడి చేశారని.. పెళ్లికి వచ్చిన బంధువులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వీరు బయలుదేరిన కొన్ని గంటలకే మృతిచెందారని తెలుసుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# మిర్చి కన్నా పత్తి సాగే బెటర్

## పత్తివైపు అధిక రైతుల మొగ్గు

**ఆదిలాబాద్,జూన్20(సమయజ్యోతి):**

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. అన్న చందంగా మారింది మిర్చి రైతుల పరిస్థితి. ప్రభుత్వాల అసమర్థత కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడారు. కనీసం పండించిన పంటను అమ్ముదామంటే మార్కెట్లో కొనేవారు కరవయ్యారు. దిక్కుతోచక పంటను కొందరు స్వయాన తగులబెట్టి తమ కడుపు మంటను వెళ్లగక్కారు. మరికొందరు కూలీ కూడా వెళ్లదని పంటను చేలల్లోనే వదిలేసారు. చేసేది లేక నిస్సహాయంగా ఆగ్రహాన్ని, ఆవేదనను తమలోనే అణచివేసుకున్నారు. దీంతో ప్రస్తుతం మళ్లీ మిర్చివేయాలంటేనే భయపడుతున్నారు. దీంతో మరోమారుపత్తి వేసేందుకు రైతులు సమాయత్తం అయ్యారు. మిరప పంట సాగు చేసినా అందుకు తగ్గట్లు మార్కెట్ సౌకర్యం లేకపోవడం, రోజురోజుకు ధర తగ్గడం వల్ల మిరప పంట సాగుచేసిన రైతులకు శాపంగా మారింది. పత్తి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు అన్నదాతలు పంట మార్పిడికి శ్రీకారం చుట్టారు. దీనికితోడు జిల్లాలో మిరప పంటకు అనువైన నేలలు ఉండటంతో ఎక్కువ మంది రైతులు పత్తికి బదులు మిరప వైపు మొగ్గుచూపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పత్తి, వరి పంటల తర్వాత మూడో పంటగా మిరప సాగు చేయడం విశేషం. పంటను మార్కెట్‌కు తరలిస్తే ఖర్చులు కూడా వెళ్లక మిరప రైతు కుదేలు అయ్యారు. మొదట తీసిన పంటే పూర్తి స్థాయిలో అమ్మకపోగా.. కనీసం మరో రెండు దఫాలుగా తీయాల్సిన పంట చేలోనే ఉండిపోయింది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. అందుకు తగ్గట్లు ధర లేకపోవడం మిరప రైతులను కుదేలు అయ్యేలా చేసింది. స్థానికంగా మిరప పంటను కొనుగోలు చేసేందుకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో జిల్లా రైతులు పక్క రాష్ట్రంలోని నాగ్‌పూర్ మార్కెట్‌పై ఆధారపడ్డారు. గతేడాది పలికిన ధరే ఈసారి పలుకుతుందని.. కష్టాలు తీరుతాయని కౌలుకు తీసుకొని కొందరు పంట సాగు చేశారు. మిర్చి ద్వారా నష్టపోయిన రైతులు ఇప్పుడు పత్తి ద్వారా అదృష్టం పరీక్షించుకోబోతున్నారు.



# మతడివాగును ఆధునీకరించాలి

## ఆయకట్టు రైతుల వినతి

**ఆదిలాబాద్,జూన్20(సమయజ్యోతి):**

జిల్లాలోని తాంసి మండలం వడ్డాడి సమీపంలో నిర్మించిన మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాలకు సాగునీరు అందనుంది. దీనిని పూర్తిస్తాయిలోకి అందుబాటులోకి తీసుకుని వస్తే రైతులకు మేలు జరుగనుంది. జిల్లాలోని తాంసి, ఆదిలాబాద్, జైనథ్ మండలాల రైతుల భూములకు సాగునీరు అందించేందుకు తాంసి మండలం వడ్డాడిలో 2004లో మత్తడివాగు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2008 ఆగస్టులో ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయి. ఈ కాలువ ద్వారా వడ్డాడి, కప్పర్ల, బండలనాగాపూర్, జామిడి, చాందా-టి. సిర్సన్న, భోరజ్, సావర్‌గాం, తరోడ, మల్లాపూర్ భీంసరి, జందాపూర్ గ్రామాల్లోని 8500 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పనులు చేపట్టారు. ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. రైతులు పంటలు సాగుచేసే ప్రతి ఎకరానికి సాగునీరు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రాజెక్టుల ఆధునీకీకరణతో ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా మారను న్నాయని రైతులు అంటున్నారు. రైతులు రెండు పంటలు సాగుచేసుకునే అవకాశాలుండడంతో ప్రభుత్వం ఈ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.ఈ కాలువ నిర్మాణంతో తాంసి మండలం హస్నాపూర్, పొన్నారి, తలమడుగు మండలం ఖోడద్ గ్రామాలకు చెందిన రైతులకు ప్రయోజనం చేకూరనుంది.



# కౌలు రైతులను ముంచుతున్న విధానాలు

**ఏలూరు,జూన్20(సమయజ్యోతి):**

దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని కౌలు రైతు సంఘ నేతలు అన్నారు. బడా కంపెనీలకు లాభం చేకూర్చేందుకు వ్యవసాయ భూములు లాక్కుని రైతులను నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2011 కౌలు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని రక్షించుకునేందుకు రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఉపాధి హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో భూతాపం పెరిగిపోయి వాతావరణ సమతుల్యం దెబ్బతిన్నదన్నారు. వ్యవసాయరంగంపై అధ్యయనం చేసేందుకు 52 కమిషన్లు వేశారని, ఒక్క కమిటీ సిఫారసు కూడా అమలు చేయలేదని తెలిపారు. ఆర్థిక సంస్కరణల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం కుదేలైందన్నారు. స్వదేశంలో ఉత్పత్తి అవుతున్న వస్తువులను కూడా దిగుమతి చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో దేశంలోనూ, రాష్ట్రంలోనూ కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయని వివరించారు. చంద్రబాబు హయాంలో నీటి తీరువా వసూలు చేసే పద్ధతి ప్రవేశపెట్టారని అన్నారు. తెలిపారు. విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడం, మార్కెట్ నియంత్రణ లేకపోవడం వంటివి ఆయన హయాంలోనే చోటు చేసుకున్నాయన్నారు.

# సంక్షోభంలో వ్యవసాయ రంగం

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

## ప్రతి గ్రామం పేదవారికి ఇళ్లు వచ్చేలా కృషి

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందించిన మంత్రి వివేక్

**సిద్దిపేట,జూన్20(సమయజ్యోతి):**

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ప్రతి ఇందిరమ్మ ఇంటికి తమ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తోందని అన్నారు. సిద్దిపేట జిల్లాకు 12వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని చెప్పారు. ప్రతి గ్రామంలోని పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తామని అన్నారు. పేదరికాన్ని దూరం చేయాలని ఇందిరాగాంధీ గరీబ్ హటావో పేరుతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ పేదలకు మంచి చేయాలనే 200యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నారని పేర్కొన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండా భూదేవి గార్డెలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మీడియాతో మాట్లాడుతూ.. సిద్దిపేటలో అడ్వాన్స్ టెక్నాలజీతో స్కిల్ డెవలప్‌మెంట్‌ని ప్రారంభిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే హామీలు నెరవేరుస్తారా అని ప్రజల్లో అనుమానం ఉండేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రూ. 8లక్షల కోట్లు అప్పు అయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కంకణం కట్టుకుందని మంత్రి వివేక్ తెలిపారు. మ ప్రభుత్వం పేదలను ఆదుకోవాలని ఆలోచన చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. మహిళలకు రూ.500లకు గ్యాస్ సిలిండర్, ఉచిత బస్ సౌకర్యం అందిస్తున్నామని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులకు రూ. 23వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. సుమారు రూ.10వేల కోట్ల రైతు భరోసా నిధులను సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల విడుదల చేశారని తెలిపారు. రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని చెప్పారు. సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం రూ.500ల బోనస్ ఇస్తోందని వెల్లడించారు మంత్రి వివేక్ వెంకటస్వామి. అంతకుముందు గజ్వేల్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా కలెక్టర్ హేమావతి పాల్గొన్నారు. గజ్వేల్‌లో 3వేల డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. గృహజ్యోతి కింద 79 వేల మంది లబ్దిదారులకు గ్యాస్ సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ÷ళిదలకు రేషన్‌కార్డ్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. 600 గజాల స్థలంలో ప్రతి నిరుపేద ఇండ్లు కట్టుకునేందుకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. విద్య, వైద్యం, ఇండ్లు, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. 600 గజాల కంటే ఎక్కువ ఇంటి నిర్మాణం ఉండేలా లబ్దిదారులు చూసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.



# పవన్ కళ్యాణ్ కనిపించారా

## వైసీపీ అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల

**శ్రీసత్యసాయి,జూన్20(సమయజ్యోతి):**

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏవేవో మాట్లాడిన పిఠాపురం పీఠాధిపతి ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కనబడటం లేదని వైసీపీ అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల విమర్శించారు. శ్రీ సత్యసాయిలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో 'డిప్యూటీ సీఎం' పవన్ కళ్యాణ్ ఎక్కడైనా కనిపించారా? అంటూ శ్యామల ప్లకార్డ్ ప్రదర్శించారు. పవన్ గురించి శ్యామల చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పవన్ కళ్యాణ్ సహా నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణపై కూడా యాంకర్ శ్యామల హాట్ కామెంట్స్ చేశారు. 'రాష్ట్రంలో కూటమి నాయకుల గెలుపు కానే కాదు.. అంతా మాయ. హిందూపూర్‌లో ఓ పోలింగ్‌లో వైసీపీకి ఒక్క ఓటు వచ్చిందంటే.. నందమూరి బాలకృష్ణ గెలుపు ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. బాలకృష్ణది అసలు గెలుపు కానే కాదు. మూడుసార్లు ఎమ్మెల్యేగా బాలకృష్ణ గెలిచినా.. హిందూపూర్‌లో అభివృద్ధి శూన్యం. హిందూపూర్‌లో డిగ్రీ కళాశాల లేని పరిస్థితి ఉంది, కేవలం బోర్డుకే పరిమితమైంది. బాలకృష్ణ సినిమా షూటింగ్‌లో బిజీ, ఆరు నెలలకు ఒకసారి హిందూపూర్ వస్తారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏవేవో మాట్లాడిన పిఠాపురం పీఠాధిపతి ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కనబడటం లేదు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు ఎక్కడైనా కనిపించారా?' అంటూ శ్యామల ప్లకార్డ్ ప్రదర్శించారు.

# ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఫోటోపై వివాదం

## ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ గందరగోళం

**సిద్దిపేట,జూన్20(సమయజ్యోతి):**

దుబ్బాకలో ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ గందరగోళంగా మారింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్లెక్సీలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటో చిన్నదిగా ఉండటంతో ఎమ్మెల్యేతోపాటు భారాస కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీంతో భారాస కార్యకర్తలకు పోటీగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారులు, పోలీసులు సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా ఇరు వర్గాలు తగ్గకపోవడంతో కార్యక్రమం రసాభాసగా మారింది. అదే సమయంలో కార్యక్రమానికి హాజరయ్యేందుకు మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అక్కడి చేరుకున్నారు. పరిస్థితి చూసి జిల్లా పాలనాధికారి హైమావతి.. పోలీసులు, అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభా వేదికపైకి వచ్చిన ఎమ్మెల్యే.. ప్రోటోకాల్ లేని వ్యక్తులు దిగాలని సూచించడంతో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో మరోసారి ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణ నెలకొంది. దీంతో హడావిడిగా మంత్రి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్‌తో కలిసి పంపిణీ చేసి వెళ్లిపోయారు. మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతున్నప్పుడు కాంగ్రెస్, భారాస నాయకులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో సభ ప్రాంగణం దద్దరిల్లింది.

# అంతరించిపోతున్న బీడీ పరిశ్రమ

## ప్రత్యామ్నాయ వృత్తుల్లో బీడి కార్మికులు

నిర్మల్,జూన్20(సమయజ్యోతి): ప్రస్తుతం మారిన పరిస్థితుల కారణంగా జిల్లాలో బీడీ పరిశ్రమ దాదాపుగా అంతరించిపోయిందనే అంటున్నారు. రోజురోజుకూ బీడీ పరిశ్రమ బలహీన పడుతుండటం కార్మికులకు శాపంగా మారుతోంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారాలు, సిగరెట్ వినియోగ ప్రాబల్యం పెరగడం లాంటి అంశాలన్నీ బీడీ పరిశ్రమను దెబ్బతీస్తూ వస్తున్నాయి. వేలాది మంది బీడీ కార్మికులకు ఉపాధిపై భరోసా రోజురోజుకూ కరవవుతున్న క్రమంలో తప్పుకుంటు న్నారు. పొగాకు దుష్ఫలితాలపై సమాజంలో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం లక్షలాది మంది బీడీ కార్మికుల జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. కారణం.. బీడీ పరిశ్రమ కేంద్రీకృతమైన ఈ ప్రాంతంలో ప్రత్యామ్నాయ ఉపాధి కరవైంది. బీడీ వినియోగం తగ్గిపోవడంతో ఈ పరిశ్రమ యజమానులు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో బీడీకి డిమాండ్ వారిపై ఆధారపడి జీవిస్తున్న వారందరికీ స్వయం ఉపాధిపై, వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి తాత్కాలిక ఉద్యోగులుగా తీసుకోనున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకొని వీరంతా జీవనం సాగిస్తున్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభంలో నెట్టుకొస్తున్న తరుణంలో ప్రభుత్వం వీరికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో బతుకులు బాగుపడనున్నాయి. నిర్మల్ జిల్లాలో ఉన్న 60 వేల మంది కార్మికులతో పాటు వారిపై ఆధార పడుతున్న దాదాపు మరో 1.50 లక్షల మందికి ఉంటారని కార్మికశాఖ అధికారులు అంచనా వేశారు. ఉద్యానవనం (పండ్లు, పూలు, కూరగాయల సాగు), కోళ్ల పరిశ్రమ, గేదెలు, గొర్రెల పెంపకం, కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, చేతి వృత్తులు, అగర్‌బత్తుల తయారీ, పాపడ్, పచ్చళ్ల తయారీపై ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు వివిధశాఖల్లో దినసరి ఉద్యోగాలుగా పనులు చేసేందుకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో టైలరింగ్, బ్యూటీషియన్, బ్యాంకింగ్, ÷నాన్స్, బీమా ఏజెంట్లు, ఆసుపత్రుల్లో సేవలు, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్, పశువైద్య సేవలపై



శిక్షణ ఇవ్వనున్నారు. బీడీ కంపెనీలు ఎప్పుడు మూతపడుతున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. బీడీలు చుట్టుడమే జీవనాధారంగా ఉన్న అనేక కుటుంబాల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుంది. స్వయం ఉపాధి పొందేందుకు రుణ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ..

# ప్రైవేట్ స్కూళ్ల విద్యా వ్యాపారం

## తడిసి మోపెడవుతున్న చదువు భారం

నిజామాబాద్,జూన్20(సమయజ్యోతి): ప్రైవేటు పాఠశాలల తీరుపై విద్యాశాఖ అధికారుల్లో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. కనీస వసతులు కరవైనా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అనుమతులు సహా ఇతర వ్యవహారాల్లోనూ పర్యవేక్షణ కొనసాగించడం లేదు. కమీషన్లతో వ్యాపారం .. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆయా పుస్తక విక్రయ దుకాణాలతో ముందస్తు ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నాయి. కొన్ని ప్రైవేటు బడుల్లో ఫీజులుం కొనసాగుతోంది. ఫీజుల విషయంలో ఇప్పటికే విద్యార్థి సంఘాలు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వాటి నియంత్రణ దిశగా కనీస చర్యలకు చేపట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడి ఆవరణలో ఎట్టిపరిస్థితుల్లో విద్యను వ్యాపారం చేసేలా పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దనే నిబంధనను ఉల్లంఘిస్తున్నా..చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నా నాణ్యమైన విద్య ముసుగులో అక్రమార్జనకు కొన్ని పాఠశాలలు తెరతీస్తున్నాయి. బడుల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దని.. ప్రభుత్వం, న్యాయస్థానం ఆదేశించినా జిల్లాలో ఆ వ్యవహారం బాహాటంగానే సాగుతోంది. కాసుల కక్కుర్తితో బడిలో వ్యాపారం నడుస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారు చెప్పిన ఫీజును కాదనలేక.. పుస్తకాలను మరో చోట కొనలేక నానాతంటాలు పడుతున్నారు. ఎల్‌కేజీ విద్యార్థి పుస్తకాలకే రెండువేల వరకు ఖర్చవుతోంది. ఇక కెజీ పెరిగిన కొద్దీ రకరకాల పుస్తకాలు కావాలంటే జేబు గుల్లకాక తప్పడంలేదు. వీటికితోడుగా రాత కోసం మరో 10 నోటు పుస్తకాలను కొనాల్సిందే. బడికి బస్సులోనే పంపాలి. ఇందుకోసం నెలకు రవాణా రుసుం కట్టాలి. పుస్తకాలకు డ్రెస్‌లకు మరో రెండు వేలు, బెల్టు, బ్యాగు, బూట్లు ఇతర నోటు పుస్తకాలకు మరో మూడువేలు వసూల చేస్తున్నారు. పిల్లలుఫలానా షాపులోనే ఇవన్నీ కొనే విధంగా రహస్య ఒప్పందాలు కొందరు కుదుర్చుకున్నట్లు సమాచారం. పుస్తక దుకాణాల వారే అధికంగా అన్ని పాఠశాలలతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఒక్కో పాఠశాల నుంచి సుమారు 400 నుంచి 1200 మంది పిల్లలు ఉంటున్నారు. ఇలా వారి సంఖ్యను బట్టి బడులకు కమీషన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది. పిల్లలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలన్నీ అక్కడే కొనాలే నిబంధనను పెడుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారి చెప్పిన ధరలకే తీసుకోవాల్సి వస్తోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా కొన్ని విద్యాసంస్థలు కోట్ల రూపాయల్లో లావాదేవీలు చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్కో బడిలో ఒక్కో విధమైన ధరల్ని నిర్ణయించారు. తరగతుల వారీగా పాఠ్యపుస్తకాలతోపాటుగా నోటు పుస్తకాలను అమ్ముతున్నారు. ఏ ఒక్కటి తీసుకోకున్నా ఒప్పుకోవడం లేదు. సట్టణంలో ఒకటి రెండు బడులకు మినహాయిస్తే ఏ ఒక్క చోట విద్యార్థులు ఆడుకునేందుకు మైదానాలు లేవు. పైగా విద్యార్థులకు క్రీడల కోసం కొన్ని చోట్ల ప్రత్యేక ఫీజు వసూలు చేస్తున్నారు. మైదానం సంగతేంటని.. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారంలో ఒక రోజు పట్టణశివారులో ఉన్న మైదానానికి పిల్లలను బస్సులో తీసుకెళ్తామనే సమాధానాలు వినిపిస్తున్నాయి.

# అస్తవ్యస్థంగా డ్రైనేజీ వ్యవస్థ

## పట్టణాల్లో మారని పరిస్థితులు

వరంగల్,జూన్20(సమయజ్యోతి): అసంపూర్తి డ్రైనేజీలు, నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగు గుంతలు అభివృద్ధిని వెక్కిరిస్తుంటాయి. ఏటా కోట్ల నిధులు ఖర్చుచేస్తున్నా ఏ కాలనీకి మురుగు నుంచి విముక్తి దక్కడంలేదు. దశాబ్దాల కాలంగా మున్సిపల్ పట్టణాలకు డ్రైనేజీలకు వెచ్చిస్తున్న నిధులు నిష్ఫలం అవుతున్నాయి. నిధులు ఖర్చు అవుతున్నా మురుగు నీటికి పరిష్కారం లభించడం లేదు. ఇలా పెద్ద నగరాల్లో సైతం డ్రైనేజీ అవ్యవస్థను చూస్తే ఈ అనుమానాలు కలగకమానవు. దశాబ్ద కాలంలో సుమారుగా కోట్ల వరకు వ్యయం చేసి ఉంటారని అంచనా. ఏటా బల్దియాకు విడుదలయ్యే నిధుల్లో మొదటి ప్రాథమ్యంగా డ్రైనేజీలకే కేటాయిస్తుంటారు. ఇన్ని నిధులు కేటాయించినా ప్రణాళిక లేని నిర్మాణాలతో నిధులు నిష్ప్రయోజనంగా మారుతున్నాయి. కాలువల నిర్మాణం చేపట్టే సమయంలో నిర్దేశిత ప్రమాణాలు పాటించక పోవడం, నాణ్యతకు తిలోదకాలివ్వడంతో మురుగు నీటి పారుదల వ్యవస్థ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పాత కాలువల స్థానంలో కొత్తవి వేస్తున్నా పైపులు వేయకుండా మళ్లీ ఓపెన్ డ్రైనేజీ కొనసాగిస్తున్నారు. దీంతో మళ్లీ చెత్తాచెదారం నిండడం మినహా ప్రయోజనం ఉండదు. ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం, ప్రణాళిక, ప్రణాళికేతర, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక పద్దుల కింద వచ్చిన నిధులతో వీటి నిర్మాణాలు చేపట్టారు. ఈ ఒక్క ఏడాదిలోనే పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. అంతకుముందు వివిధ పథకాల్లో వచ్చిన నిధులు ఈ పనులకే వెచ్చించారు. ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ పేరిట రుసుములు వసూలు చేస్తారు. ఇందుకు తగ్గట్లుగానే మురుగు కాలువలు, రహదారులు, తాగు నీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. లేఅవుట్ లేకుండా రోజుకో కాలనీ పుట్టుకొస్తున్న తరుణంలో భగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో వచ్చిన నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీలు ప్రణాళికా బద్ధంగా ఉండటంలేదు. వచ్చిన నిధులతో డ్రైనేజీలు నిర్మించామా లేదా అన్నదే ప్రధానంగా మారింది. నిధుల రాకను బట్టి ఒక్కో వీధికి ఒక్కోసారి ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న కాలువలు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండటం లేదు. నిధులు బురదలో పోసినట్లవుతుంది. పట్టణానికి మురుగు సమస్య తీరడం లేదు..

# జోరుగా మంచినీటి వ్యాపారం

## నిబంధనలు పాటించని ప్లాంట్లు

జగిత్యాల,జూన్20(సమయజ్యోతి): నీటిశుద్ధి కేంద్రాల ఏర్పాటులో నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. ఇళ్ల సమీపంలోనే గొట్టపుబావులను తవ్విస్తూ అనుమతులు లేకుండానే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే వందలాది నీటిశుద్ధికేంద్రాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వ్యక్తి పర్యవేక్షణలో వివిధ రసాయనాలను కలిపి నీటిని శుద్ధి చేయాల్సి ఉండగా అవేమీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా నీటిలో ఉండే ఖనిజలవణాలు, పోషకాలు పూర్తిగా తొలగిపోతున్నాయి. ఇలాంటి నీరు తాగడంతో కొద్ది రోజులకే ఎముకలు, కీళ్ళ సంబంధిత వ్యాధులు సోకుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల జిల్లాలో తాగునీటికి తీవ్ర ఎద్దడి నెలకొనడంతో కరవులోనూ కొందరు వ్యాపారులు శుద్ధజలం పేరిట సొమ్ముచేసుకున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా నీటిదందా కొనసాగుతోంది. ఈ నీటిని తాగిన ప్రజల ఆరోగ్యం మెరుగు పడకపోగా మరింత క్షీణించే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలో వినియోగం ఎక్కువగా ఉండటంతో పాటు శుభకార్యాలు ఎక్కువగా జరిగే ప్రస్తుత వేసవిలో సాంకేతికకు తిలోదకాలు ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు చల్లని నీటి పేరుతో మరింతగా సొమ్ముచేసుకుంటున్నారు. చల్లని నీటి క్యాన్‌కు రూ.20నుంచి రూ.40వరకు వసూలు చేస్తున్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే సంబంధిత పురపాలక, నగరపాలక సంస్థలతోపాటు గ్రామ పంచాయతీ, వాణిజ్య పన్నులు, రెవెన్యూ, ఆహార నియంత్రణశాఖ, భూగర్భజలవనరుల శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. చాలామంది నిర్వాహకులు పన్నులను ఎగ్గొట్టడంతో ప్రభుత్వ ఖజానాకు చిల్లు పడుతుంది.

# కార్పోరేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణ ఏదీ ?

ఏలూరు,జూన్20(సమయజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల ప్రభుత్వరంగం నిర్వీర్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనార్టీలకు ప్రయివేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని,కార్పొరేట్ కాలేజీల్లో, స్కూళ్లలో ఫీజుల నియంత్రణ ఉండాలని డిమాండ్ చేశారు. సహజ వాయువుల వెలికితీతతో సారవంతమైన భూములు నాశనం కావడమే కాకుండా పర్యా వరణానికి పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. జిల్లాలోని అండలూరు, కృష్ణా జిల్లా మోదుగుమూడి, కొమరల్లపూడి తీరప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. దీనివల్ల ఉత్పన్నమయ్యే మిథేన్ భూతాపాన్ని పెంచుతుందని, అణుధార్మిక రాడన్ వాయువు వెలువడి వాయుకాలుష్యం ఏర్పడుతుందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారని తెలిపారు.

# కెసిఆర్‌ను విలన్ చేయే యత్నంలో హరీష్

## నీళ్లతో రాజకీయం చేసిన పార్టీ బిఆర్ఎస్

## జగన్‌తో కుమ్మక్కయి కృష్ణ జలాలకు తిలోదకాలు

## భువనగిరి ఎంపి చామల కిరణ కుమార్

హైదరాబాద్,జూన్20(సమయజ్యోతి): బీఆర్ఎస్ నేత హరీష్ రావు వాళ్ల మామ.. మాజీ సీఎం కేసీఆర్‌ను విలన్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ ఆరోపించారు. నీళ్ళు అనే పదంతో బీఆర్ఎస్ రాజకీయం చేసిందని, బీఆర్ఎస్ నేతలు బేసిక్ నాలెడ్జ్‌తో ప్రాజెక్టులు కడితే బాగుండేదని అన్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత తెలంగాణ ప్రజలకు నీళ్ల సంగతి పూర్తిగా అర్థమైందని, 2016 సీడ్ల్యూసీ మీటింగ్‌లో కేసీఆర్ ఏం మాట్లాడారో చెప్పాలన్నారు. కేసీఆర్‌కు ఉన్న అపరజ్ఞానం వల్లే కాళేశ్వరం కూలేశ్వరం అయిందని విమర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డితో నాలుగు సార్లు మంతనాలు జరిపి తెలంగాణ నీళ్లకు అన్యాయం చేసింది కేసీఆర్ అని, హరీష్ రావు వైఖరి వల్లే ఏపీ నేతలు బనకచర్లకు నీళ్ళు తరలించుకుందామనే ఆలోచన చేశారని చామల కిరణ్ అన్నారు. గోదావరి జలాలపై గొంతు చించుకునే బీఆర్ఎస్ నేతలు.. కృష్ణా జలాలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. హరీష్ రావుకు కంటెంట్ కంటే ఎక్కువ ఆవేశమే ఉందని, బీఆర్ఎస్ నేతలు సీఎం కుర్చీలో రేవంత్ రెడ్డిని చూడలేక పోతున్నారని అన్నారు. నదీ జలాలు ఎవరి అయ్యా జాగీరు కాదని హరీష్ రావు తెలుసుకోవాలన్నారు. నీళ్ళ అంశంపై తనకు, కేసీఆర్‌కు తప్పా ఎవరికీ ఏం తెలియదని హరీష్ అనుకుంటున్నారని, తెలంగాణ నీటిని ఏపీకి ధారాదత్తం చేసిందే కేసీఆర్ అని చామల కిరణ్ ఆరోపించారు. హరీష్ రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడే ఈ పంచాయితీ మొదలైందన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం వినకపోతే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కుతామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి కమిట్‌మెంట్ అర్థం చేసుకోవచ్చునని అన్నారు. బనకచర్లపై ఏకగ్రీవ తీర్మాణం చేద్దామని అనుకునే సమయానికి ఆల్ పార్టీ మీటింగ్ నుండి బీఆర్ఎస్ ఎంపీ వాకౌట్ చేసారన్నారు. బేస్ వదిలి దోచుకునే ప్రయత్నం చేశారు కాబట్టే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారన్నారు. బేసిక్స్ కాదు తమకు ఎథిక్స్ ఉన్నాయి కాబట్టే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని ఎంపీ చామల కిరణ్ అన్నారు.



# కాళేశ్వరం దండగమారి ప్రాజెక్ట్

## దానిపై మరిన్నినిధులు వృధా చేయడం తగదు

## సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,జూన్20(సమయజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు దండగమారి ప్రాజెక్ట్ అని, దానిపై అనవసరంగా నిధులు వృధా చేయవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని, ఇంకా నష్టాలను ప్రజలపై రుద్దవద్దన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు తీసేసి.. వాటిలోని పైపులను వాడుకోవాలని సూచించారు. ఆ మూడు బ్యారేజీల మరమ్మతులకు రూ.20వేల కోట్లు ఖర్చు అవుతోందని, అంత ఖర్చు పెట్టినా వరద ఉధృతి వల్ల బ్యారేజీలు కొట్టుకుపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారని అన్నారు. ఆ మూడు ప్రాజెక్టులకు పెట్టే ఖర్చుకు బదులు ప్రాణహిత పూర్తి చేస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. 3 ప్రాజెక్టులు తీసేయడం వల్ల కేవలం రూ.10వేల కోట్ల నష్టం వస్తుంది. వీటికి మరమ్మతులు చేసే బదులు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో గోదావరిపై 14 చిన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వృధా అని నేను చెప్పలేదు. కేవలం ఆ మూడు బ్యారేజీలపై మాత్రమే మా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం. తెలంగాణను సంప్రదించకుండా ఏపీ సీఎం చంద్రబాబు ప్రాజెక్టులు చెపడుతున్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపేయాలి.పరివాహక ప్రాంతాల వారీగా నిబంధనల మేరకు నీటి వాటాలు జరగాలి. ఇద్దరు సీఎంలు కూర్చొని బనకచర్ల ప్రాజెక్టుపై మాట్లాడుకోవాలన్నారు. నీటి ప్రాజెక్టులపై రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు. పోలవరం ప్రాజెక్టు కడుతున్న ఏపీకి కొత్త ప్రాజెక్టులు ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కూనంనేని కోరారు. ఉన్న ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలన్నారు.

# వరంగల్ కోర్టుకు బాబు బెదరింపు

## ముమ్మర తనిఖీలు చేపట్టిన పోలీసులు

హనుమకొండ,జూన్20(సమయజ్యోతి): వరంగల్ కోర్ట్ ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు ఓ ఆగంతకుడు పోలీసులకు ఫోన్ చేసి బెదిరించాడు. ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. డయల్100 నెంబర్‌కి ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులు వెంటనే అప్రమత్తం అయ్యారు. కోర్టు ప్రాంగణంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో కోర్టు ప్రాంగణంలో పెట్టిన ఆరు డిటోనేటర్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సకాలంలో పోలీసుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. కోర్ట్ పరిసరా ప్రాంతాలను పోలీసులు బాంబ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలను కోర్టు ప్రాంగణం నుంచి దూరంగా పంపించి వేశారు. ఫోన్ ఎక్కడ నుంచి వచ్చింది.. ఎవరు చేశారనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కోర్టు ప్రాంగణం మొత్తం ఆధీనంలోకి తీసుకుని జల్లెడ పట్టారు. ఈ క్రమంలోనే కోర్టు ఆవరణలో భద్రపరిచిన 6 డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డిటోనేటర్లను ఆత్మకూరుకు చెందిన ఓ కేసు విషయంలో గతంలో స్వాధీనం చేసుకున్నవిగా గుర్తించారు. డిటోనేటర్లకు సంబంధించిన కేసు ఎప్పుడు కొట్టివేసినట్లు పోలీసులు వెల్లడించారు. తాజా బాంబ్ బెదిరింపు కాల్‌కు ఈ డిటోనేటర్లకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులు, కోర్టు సిబ్బంది పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బెదిరింపు కాల్ చేసిన అజ్ఞాత వ్యక్తి కోసం గాలిస్తున్నారు. బాంబ్ బెదిరింపు కాల్‌తో జిల్లా కోర్టుకు వచ్చిన వారు భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోకుండా కోర్టు వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

# లక్ష్మీపల్లిలో సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహణ

**దేవరకద్ర, జూన్ 14 (సమయ జ్యోతి):**

దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొదటి తరగతిలో చేరిన చిన్నారుల కోసం శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) లక్ష్మీపల్లి బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర గుప్తా మాట్లాడుతూ, “చదువుతోనే జీవితాన్ని మెరుగుపరచుకోవచ్చు. విద్యతోనే భవిష్యత్తు వెలుగొందుతుంది” అన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ విద్యలో ఉత్తమ స్థాయికి ఎదగాలని సూచించారు. దేశ సంప్రదాయాలను పాటిస్తూ ఇంగ్లీష్ మీడియం విద్యను అందిస్తున్న పాఠశాల సేవలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా చదువుల తల్లి సరస్వతి దేవికి పూజలు నిర్వహించగా, విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ వడ్ల విశ్వేశ్వర చారి తన స్వంత ఖర్చులతో పలకలు, బలపాలు చిన్నారులకు పంపిణీ చేశారు. విద్యకు సమాజంలో ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ, తల్లిదండ్రులు పిల్లలను తప్పక పాఠశాలలకు పంపించాలని సూచించారు. జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై దృష్టిపెట్టే విధంగా పనిచేస్తున్నాయని తెలిపారు. బడి ఈడు వయస్సు ఉన్న ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్పించాలని కోరారు. హెచ్ఎం ఎస్. కల్పన మార్గదర్శనంలో విద్యార్థులు ఆలపించిన శ్లోకాలు హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నాగేష్ గౌడ్, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మురళీధర్, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, విజయలక్ష్మి, నాగేశ్వర్ రెడ్డి, ఆశ్ర ఖాద్రి, శంకర్, కమల్ రాజ్, మదన్ మోహన్, సుజాత, వెంకట్రాములు, అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, పాండమ్మ తదితరులు పాల్గొన్నారు.




# టీడీపీ సత్కరించింది మాజీ బుచ్చిలింగం గారి 6వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి కాగజ్‌నగర్,**

తెలుగు దేశం పార్టీ (టీడీపీ) నాయకులు, సభ్యులు మాజీ సర్పంచ్, సిర్పూర్ కాగజ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ బుచ్చిలింగం 6వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. కాగజ్‌నగర్ టీడీపీ పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ కన్వీనర్ గుల్లపల్లి ఆనంద్ బుచ్చిలింగం చిత్ర పటానికి పూసలు వేసి, ఆయన ప్రజా సేవలకు అంకితభావం గుర్తు చేస్తూ ప్రసంగించారు. “బుచ్చిలింగం కాగజ్‌నగర్ మునిసిపల్ అభివృద్ధికి కీలక పాత్ర పోషించి, ఎకైక ఆదిలాబాద్ జిల్లాలో టీడీపీ బలోపేతంలో కీలక భాగస్వామి. ఆయన ఆలోచనలు, లక్ష్యాలు మాకు మార్గదర్శకం,” అన్నారు ఆనంద్.
జూన్ 2019లో గుండెపోటుతో మరణించిన బుచ్చిలింగం గ్రామీణ స్థాయిలో నాయకత్వం, ప్రజల సంక్షేమానికి అంకితభావం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆయన సేవలను టీడీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి న. చంద్రబాబు నాయుడు కూడా సార్వజనీకంగా పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. నివాళుల కార్యక్రమంలో బుచ్చిలింగం స్మృతిలో పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం స్థానిక పద్మశాలి భవన్‌లో ప్రత్యేక స్మరణ సభ నిర్వహించి, సంఘసభ్యులు, స్నేహితులు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జెనరల్ సెక్రటరీ పెరుగు ఆత్మారం, ఎల్. మధుకర్, గులాబ్ రావు, పొచన్న, ఎల్. శ్రీనివాస్, చల్లూరి శంకర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీ పాఠశాల మరియు తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ పలు రికార్డులను పరిశీలించిన - కలెక్టర్ సిక్తా పట్నాయక్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణపేట జిల్లా**

మండలం పరిధిలోని హిందూపూర్ కేజీబీవీ విద్యాలయాన్ని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా విద్యాధికారి గోవిందరాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. పాఠశాల పరిశుభ్రత,పరిసరాల బాగోగుల గురించి ఆరా తీశారు. విద్యార్థినీలకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 2024 -25 సంవత్సరంలో 100% ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినిలకు ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా అమ్మాయిల పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరచాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గత వారం క్రిందట నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి స్వీకరించిన ఈ దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. ఈ తనిఖీ సందర్భంలో భాగంగా జి సి డి ఓ నర్మద,ఎంపీడీవో జానయ్య,తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ ఐ లు మదన్మోహన్ రెడ్డి,అమర్నాథ్ రెడ్డి, కేజీబీవీ పాఠశాల ఎస్ఓ షాలిని పాల్గొన్నారు.



# పిఓస్కో నిందితుడు ఆదిలాబాద్ గుడిహత్నూర్ బస్ స్టాండ్లో గొంతు -కోసుకొని ఆత్మహత్యాయత్నం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి గుడిహత్నూర్**

ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ మండల బస్ స్టాండ్లో పిఓస్కో కేసులో నిందితుడు అరుణ్ బ్లేడుతో తన గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఘోర సంఘటన జరిగింది. గుడిహత్నూర్ మండలం కేంద్రానికి చెందిన అరుణ్ కోర్టుకు హాజరు కాకపోవడంతో అతపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కాగా, పోలీసుల అరెస్టు ప్రయత్నం సమయంలో అరుణ్ చేతిలోని బ్లేడుతో తన గొంతును కోసుకున్నాడు. తక్షణమే అరుణ్‌ను ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్లు సమాచారం.
అరుణ్‌కు గతంలో గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఒక ఎస్సై, హెూం గార్డును బ్లేడుతో దాడి చేసి గాయపరిచిన చరిత్ర ఉంది. ఇది అరుణ్ చేసిన తాను గాయపరచుకుని ప్రజలలో హల్చల్ సృష్టించిన మూడవ సంఘటన అని అధికారులు తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు, అరుణ్‌ను పట్టుకోవడానికి నాన్ బెయిలబుల్ వారెంట్ ప్రకారం పోలీసులు చర్యలు తీసుకుంటుండగా, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతుందని అన్నారు.

# మంత్రికి గొర్రె పిల్లను బహుకరించి యాదవ సంఘం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పాడి పరిశ్రమ పశుసంవర్ధక,మత్స్య క్రీడలు యువజనుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి అమరచింత యాదవ గొల్ల సంఘం అధ్యక్షులు జింక రవి యాదవ కుల సంప్రదాయం ప్రకారం మంత్రికి భుజంపై గొంగడి వేసి గొర్రె పిల్లను బహూకరించారు. అనంతరం యాదవ్ గొల్ల కులం అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ఉపాధ్యక్షుడు విజయ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి కప్పల నాగరాజ్, పోసిరి గారి విష్ణు, మాజీ ఎంపిటిసి పి. తిరుమలేష్, రాఘవేంద్ర, హమాలి నర్సిమా, రవి తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 29న అమరచింతలో ప్రజా గాయకుడు సాయిచంద్ విగ్ర ఆవిష్కరణ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

తెలంగాణ రాష్ట్ర ప్రజా గొంతుక గాన గాంధరుడు గాన కోకిల తెలంగాణ గాయకుడు దివంగత సాయిచంద్ విగ్రహాన్ని ఈ నెల 29న తాను జన్మించిన అమరచింత పట్టణంలో ఏర్పాటు చేస్తున్నట్లు గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజిని సాయిచంద్ వెల్లడించారు. శుక్రవారం విగ్రహం ఏర్పాటు నిర్మాణ పనులను పరిశీలించి అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. పార్టీలకతీతంగా గ్రావిష్కరణ కార్యక్రమంలో విజయవంతం చేయాలని కోరారు. వీరి వెంట బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు భూషణ్ గౌడ్, మాజీ కౌన్సిలర్ లెనిన్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సౌండ్ శేఖర్,శరత్, కొత్తకోట కిరణ్, పట్నం సూరి తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# జట్టులో నితీష్‌కు దక్కని చోటు

## జట్టులోకి శార్దూల్ ఠాకూర్..-సాయి సుదర్శన్‌కూ అవకాశం

## ఇంగ్లాండ్‌తో భారత్ తొలి టెస్టు షురూ-టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్



భారత్- ఇంగ్లాండ్ మధ్య హెడింగ్లీ వేదికగా తొలి టెస్టు మ్యాచ్ ప్రారంభం అయ్యింది. ఈ మ్యాచ్?లో టాస్ నెగ్గిన ఇంగ్లాండ్ మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో భారత్ తొలుత బ్యాటింగ్?కు దిగనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత భారత్ ఆడుతున్న తొలి మ్యాచ్ కావడం వల్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే ఈ మ్యాచ్?లో తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డికి నిరాశే మిగిలింది.ఎన్నో ఆశలతో ఇంగ్లాండ్?కు పయణమైన నితీశ్?కు తొలి మ్యాచ్?లో చోటు దక్కలేదు. ఆల్?రౌండర్ కోటాలో నితీశ్?కు బదులుగా మేనేజ్?మెంట్ శార్దూల్ ఠాకూర్?ను ఎంపిక చేసింది. అయితే ఈ సిరీస్?లో ఇది మినహా ఇంకా నాలుగు మ్యాచ్?లు ఉన్నాయి. తదుపరి మ్యాచ్?ల్లోనైనా నితీశ్ చోటు దక్కించుకోవాని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. కాగా, గతేడాది నవంబర్?లో బోర్డర్- గావస్కర్ ట్రోఫీతో నితీశ్ టెస్టుల్లో ఎంట్రీ ఇచ్చాడు. ఈ సిరీస్?లో పూర్తిగా ఐదు మ్యాచ్?లు ఆడాడు. కెరీర్?లో తొలి సీజన్, అదీనూ ఆసీస్ గడ్డపై ఆడినప్పటికీ నితీశ్ ఆకట్టుకున్నాడు. 9 ఇన్నింగ్స్?లో 37 సగటుతో 298 పరుగులు చేశాడు. ఇందులో ఓ సూపర్ సెంచరీ ఉంది. కాగా, రీసెంట్?గా ముగిసిన ఐపీఎల్?లో అదరగొట్టిన యంగ్ ప్లేయర్ సాయి సుదర్శన్ ఈ మ్యాచ్?తో టెస్టు అరంగేట్రం చేశాడు. 23ఏళ్ల లెఫ్ట్ హ్యాండర్ 2023లో వన్డే, 2024లో టీ20ల్లో ఎంట్రీ ఇవ్వగా టెస్టుల్లో తాజాగా అడుగుపెట్టాడు. ఈ మ్యాచ్?లో సుదర్శన్ మూడో స్థానంలో బ్యాటింగ్?కు దిగే ఛాన్స్ ఉంది. మరోవైపు, దాదాపు 8ఏళ్ల తర్వాత కరుణ్ నాయర్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అతడు మిడిలార్డర్?లో బ్యాటింగ్?కు రానున్నాడు. కరుణ్ చివరిసారిగా 2017లో టెస్టు మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత పలు కారణాలతో జట్టులో చోటు కోల్పోయాడు. సాయి సుధర్సన్, టీమ్‌లో ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడో, టెస్టులలో ఎలాంటి ప్రదర్శన చేస్తాడో అన్న చర్చ సాగింది. ఇంగ్లండ్ వేళ్లే టీంలోనే కాదు ఇప్పుడు ఏకంగా ప్లేయింగ్ లెవన్‌లో చోటు లభించింది. ఇంగ్లాండ్‌లో టెస్టులు ఆడే అవకాశం ఏ క్రికెటర్ అయినా ప్రతిష్టాత్మకంగా భావిస్తాడు. సద్వినియోగం చేసుకొని సత్తా చాటాలని అనుకుంటారు. ఇప్పుడు అదే భావన వ్యక్తం చేశాడు సాయి సుదర్శన్. ఇంగ్లీష్ పిచ్‌లు అంత ఈజీగా ఉండవు. అలాంటి పిచ్‌లపై అరంగేట్రం చేస్తున్న సాయి సుదర్శన ప్రదర్శన ఎలా ఉంటుందో అన్న ఆసక్తి ఆయన అభిమానుల్లో ఉంది. ఇంగ్లాండ్‌తో జరిగే మొదటి టెస్ట్ మ్యాచ్‌కు భారత టీమ్‌లో కెప్టెన్‌గా శుభ్‌మన్‌గిల్ ఉంటే... ఓపెనర్లుగా జైస్వాల్, కెఎల్ రాహుల్ ఉన్నారు. సాయి సుధర్సన్‌కు టీమ్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాడు. ప్రాక్టీస్ సెషన్లలో కోచ్ గౌతం గంభీర్ అతనితో మాట్లాడి పిచ్ స్వభావంపై టెక్నిక్‌పై కొన్ని సూచనలు చేశాడు. సాయి సుధర్సన్ పిచ్‌ను చూసి, ప్రార్థన చేసి, ఫిస్ట్ పంప్ చేసిన సంగతి వైరల్ అయింది. అప్పుడే ఫస్ట్ టెస్టు మ్యాచ్ ఆడుతున్నాడనే విషయం ఖరారు అయ్యింది. ఇప్పుడు ఏకంగా అధికారిక ప్రకటన వచ్చేసింది. సాయి సుధర్సన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తుండగా కరణ్ నాయర్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. సాయి సుదర్శన కేవలం ఐపీఎల్‌లోనే కాకుండా, ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో కూడా మంచి ఫార్మ్ కనబరిచాడు. అతను 29 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌ల్లో 1957 పరుగులు సాధించాడు. ఓపెనర్‌గా 33 ఇన్నింగ్స్‌ల్లో సగటు 42.33, మూడవ స్థానంలో 8 ఇన్నింగ్స్‌ల్లో సగటు 34.88, ఆరవ స్థానంలో 6 ఇన్నింగ్స్‌ల్లో సగటు 45.33తో పరుగులు సాధించాడు.ఇంగ్లాండ్‌లో సర్రే కౌంటీ క్రికెట్ క్లబ్‌తో కొన్ని మ్యాచ్‌లు ఆడిన అనుభవం కూడా సాయికి ఉంది. అతను 7 మ్యాచ్‌లు ఆడి, ఇంగ్లీష్ పరిస్థితులను అర్థం చేసుకున్నాడు. ఇది ఈ టెస్ట్ మ్యాచ్‌లో అతనికి చాలా ఉపయోగపడుతుందని టీమిండియా భావిస్తోంది. చాలా కాలం తర్వాత జట్టులోకి కరుణ్ నాయర్ రీ ఎంట్రీ ఇచ్చాడు. తను ఈ మ్యాచ్ లో ఆరో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. ఇక బ్యాటింగ్ లైనప్ విషయానికొస్తే కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ ఓపెనర్లుగా బరిలోకి దిగుతారు. మూడో స్థానంలో సాయి సుదర్శన్ ఆడనున్నాడు. ఈ మ్యాచ్ తనకు డెబ్యూ కావడం విశేషం. సీనియర్ ప్లేయర్ అయిన అభిమన్యు ఈశ్వరన్ ను కాదని సుదర్శన్ ను జట్టులోకి తీసుకున్నారు. ఇటీవల ఐపీఎల్లో రెడ్ హాట్ ఫామ్ లో ఉండటమే దీనికి కారణం. ఇక నాలుగు, ఐదు స్థానాల్లో గిల్, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ బ్యాటింగ్ చేస్తారు. స్పిన్ ఆల్ రౌండర్ గా రవీంద్ర జడేజా బరిలోకి దిగుతాడు.

**భారత్ తుది జట్టు :**
యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్(వికెట్ కీపర్), కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ **ఇంగ్లాండ్ తుది జట్టు:** జాక్ క్రాలే, బెన్ డకెట్, ఒల్లీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్(కెప్టెన్), జామీ స్మిత్(వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్సే, జోష్ టంగ్, షోయబ్ బషీర్



# 8 ఏళ్ల తర్వాత టెస్ట్‌లు ఆడుతున్న కరుణ్ నాయర్

కరుణ్ నాయర్... భారత క్రికెట్‌లో ఈ మధ్య బాగా వినిపించిన పేరు. ఇప్పుడు ఇంగ్లాండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు ఎంపికైనప్పటి నుంచి కూడా కరుణ్‌పై అందరూ దృష్టి పెట్టారు. ఇప్పుడు ఫైనల్ 11లో కూడా చోటు దక్కించుకోవడంతో అతని ఆటపై ఆసక్తి ఏర్పడింది. ఎందుకంటే అతను దాదాపు 8 ఏళ్ల తర్వాత టెస్ట్‌లు ఆడుతున్నాడు. ఒకవిధంగా చెప్పాలంటే ఇది రీ డెబ్యూ లాంటిది. డొమెస్టిక్ క్రికెట్‌లో కరుణ్ చూపించిన ఫామ్, ఇంగ్లాండ్‌లోని ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో చేసిన డబుల్ సెంచరీ టీమిండియా ఫైనల్ 11లో చోటు దక్కేలా చేసింది. వీటితోపాటు టీమ్‌లోని సీనియర్‌లు లేకపోవడంతో కూడా అతన్ని ఎంపిక ఈజీ అయ్యింది. కరుణ్ నాయర్ 2016లో టెస్ట్‌లకు అరంగేట్రం చేశాడు. అతని కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన క్షణం ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్‌లో 303 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను భారత్‌కు రెండవ ట్రిపుల్ సెంచరీ సాధించిన బ్యాట్స్‌మెన్‌గా చరిత్ర సృష్టించాడు. కానీ, ఈ ఇన్నింగ్స్‌తో అతను టీమ్‌లో స్థిరంగా స్థానం సంపాదించుకోలేకపోయాడు. 2017లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచే అతని చివరి టెస్ట్‌గా మారింది. ఇన్నాళ్లకు ఇప్పుడు మరోసారి ఇంగ్లండ్‌తో టెస్టు మ్యాచ్ ఆడుతున్నాడీ 33 ఏళ్ల ప్లేయర్. ఇంగ్లాండ్‌తో ఈ సిరీస్ కరుణ్ నాయర్ కెరీర్‌కు చాలా కీలకం. మంచి కమ్‌బ్యాక్ అవుతుందని కూడా విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే అతన్ని ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దించుతున్నారు. అతనిపై ఉన్న అంచనాలను మరింత పెంచేసేలా ప్రాక్టీస్ మ్యాచ్‌లో డబుల్ సెంచరీ చేయడం మొదటి టెస్టులో ప్లేయింగ్ లెవ్‌లో స్థానంభించేలా చేసింది. కరుణ్ నాయర్‌కు టీమ్‌లో కెఎల్ రాహుల్‌తో మంచిస్నేహం ఉంది. ఇద్దరు 11 సంవత్సరాల వయస్సు నుంచి కలిసి క్రికెట్ ఆడుతున్నారు. ఇద్దరూ 33 ఏళ్ల వయసులో ఉన్నారు. ఈ సిరీస్‌కు ముందు కెఎల్ రాహుల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... “మేము ఇద్దరం చాలా కాలం భారత్‌కు కలిసి ఆడాలని కోరుకుంటున్నాం. కరూన్ డొమెస్టిక్ క్రికెట్‌లో ఫార్మ్‌తో టీమ్‌లోకి వచ్చాడు. ఎలాగైనా టీమ్‌లోకి తిరిగి రావాలనే తపనతో రాణించాడు. అనుకున్నది సాధించాడని అని చెప్పాడు.కరుణ్ నాయర్‌కు ప్రాక్టీస్ మ్యాచ్‌లో గాయమవడంతో మొదటి మ్యాచ్‌కు అందులో ఉంటాడోలేడో అని అనుకున్నారు కానీ చివరకు ప్లేయింగ్ 11లో స్థానం సంపాదించుకున్నాడు. కరుణ్ నాయర్ నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో బంతి రిబ్స్‌కు తగిలింది. దీంతో బాధతో విలవిలలాడిపోయాడు. కానీ కాసేపటికే మళ్లీ బ్యాటింగ్ కొనసాగించాడు. ఈ ఘటన తన ఫిట్నెస్‌పై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపలేదు. కరుణ్‌తో బ్యాటింగ్ కోచ్ ప్రత్యేకంగా మాట్లాడి స్టాన్స్, టెక్నిక్‌లో మార్పులు గురించి సూచనలు చేశాడు. ఆ తర్వాత కరుణ్ నాయర్ కొంత మెరుగైనట్టు కనిపించింది. మాజీ భారత బ్యాట్స్మన్ ముహమ్మద్ కైఫ్ కరుణ్ నాయర్ పునరాగమనాన్ని సపోర్ట్ చేశాడు. “కరూన్ నాయర్ ద్రవిడ్, లక్ష్మణ్, పుజారా వంటి బ్యాట్స్‌మెన్ స్థాయిలో ఆడగలడు. అతను రంజీలో పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఇంగ్లాండ్‌లో టెస్ట్‌లు ఆడేటప్పుడు ఈ టైప్ బ్యాట్స్మన్‌కు ఎంతో అవసరం” అని కైఫ్ అభిప్రాయపడ్డారు. ‘ఇంగ్లాండ్‌లో టెస్ట్‌లు ఆడేటప్పుడు, బ్యాట్స్మన్ ఒక్కరోజు పూర్తిగా బ్యాటింగ్ చేయగలిగితే టీమ్‌కు మంచిది. కరుణ్ నాయర్‌లో ఈ సామర్థ్యం ఉంది. అతను గ్రౌండ్ షాట్స్‌తో పరుగులు సాధించగలడు. ఇంగ్లాండ్‌లోని పిచ్‌లు సీమ్, స్వింగ్‌కు అనుకూలంగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో కరుణ్ నాయర్ టైప్ బ్యాట్స్మన్‌కు ఎంతో అవసరం” అని కైఫ్ అభిప్రాయపడ్డారు.

# పంత్.. జట్టుకు నీ అవసరం ఉంది

### నువ్వు చాలా నైపుణ్యం గల ఆటగాడివి-పరిస్థితికి తగ్గట్టుగా ఆడటం ముఖ్యం-పంత్ కు సచిన్ టెండూల్కర్ సలహాలు



క్రికెట్ ప్రపంచంలో సచిన్ టెండూల్కర్ మాటలకు ఎప్పుడూ ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆయన క్రికెట్‌ను లోతుగా అర్థం చేసుకున్న విధానం, ఆటగాళ్లను విశ్లేషించే నైపుణ్యం అందరికీ తెలిసిందే. అలాంటి సచిన్, భారత వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ బ్యాటింగ్‌పై ఆందోళన వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పంత్ ఆడే ‘రిస్క్’ షాట్ల గురించి సచిన్ హెచ్చరించడం, ఇది భారత క్రికెట్‌కు ఒక అప్రమత్తత సంకేతంగా చూడొచ్చు. “నేను కెప్టెన్‌ని అయితే, రిషబ్ పంత్‌కి ఇలా చెబుతాను.. నువ్వు చాలా నైపుణ్యం గల ఆటగాడివి. జట్టుకు నీ అవసరం ఉంది. కొన్నిసార్లు, నువ్వు తీసుకునే రిస్కులు అనవసరం అనిపిస్తుంది. మ్యాచ్‌ను గెలిపించే షాట్లు ఆడాలి, కానీ వికెట్ పారేసుకునే షాట్లు కాదు. నీ సహజమైన ఆటను ఆడాలి, కానీ పరిస్థితికి తగ్గట్టుగా ఆడటం ముఖ్యం.” అంటూ తేల్చేశాడు.రిషబ్ పంత్, తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రసిద్ధి. అసాధారణమైన షాట్లు ఆడగల సామర్థ్యం అతనికి ఉంది. అయితే, కొన్నిసార్లు అతను మ్యాచ్ పరిస్థితిని విస్మరించి, ప్రమాదకరమైన షాట్లు ఆడుతూ తన వికెట్‌ను పారేసుకుంటాడు.


## ఇంగ్లాండ్‌లో టెస్టు సిరీస్ నెగ్గడమే అతి పెద్ద విజయం

### టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్



ఐపీఎల్ ట్రోఫీ నెగ్గడం, ఇంగ్లాండ్?లో సిరీస్ దక్కించుకోవడం రెండింట్లో నీకు ఏది ముఖ్యమని ప్రెస్?మీట్?లో అడగ్గా, గిల్ ఒక్క సెకన్ ఆలోచించకుండానే రిప్లై ఇచ్చాడు. ‘ఐపీఎల్ ట్రోఫీ కంటే ఇంగ్లాండ్?లో టెస్టు సిరీస్ నెగ్గడమే అతి పెద్ద విజయం. కెప్టెన్?గా ఇంగ్లాండ్?లో జట్టుకు నాయకత్వం వహించే అవకాశం లభించడం చాలా అరుదు. మనం ఉత్తమమైన ప్లేయరైతే రెండు మాడుసార్లు ఈ ఛాన్స్ దక్కొచ్చేమో. కానీ, ఐపీఎల్ ప్రతి ఏడాది వస్తుంటుంది. ట్రోఫీ సాధించడం కోసం ప్రతీ సంవత్సరం ఛాన్స్ ఉంటుంది. కానీ, %ాజుచీూ% (సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో టెస్టు సిరీస్ సిరీస్ దక్కించుకోవడం నిజంగా అతి పెద్ద విషయం’ అని గిల్ రిప్లై ఇచ్చాడు.అలాగే తమ జట్టుపై ఉన్న సందేహాలను కూడా గిల్ సమర్థంగా తిప్పికొట్టాడు. ‘టీమ్‌ఇండియాకు నాయకత్వం వహించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఇక విరాట్ భాయ్? నాలుగో స్థానంలో బ్యాటింగ్ కోసం కోచ్ గంభీర్ భాయ్?తో చర్చించాను. సెంకడ్ డౌన్?లో నేనే బ్యాటింగ్?కు వస్తా. కెప్టెన్సీ గురించి ఎక్కువగా ఆలోచించి ఒత్తిడిలో పడడం నాకు ఇష్టం లేదు. ఈ సిరీస్?లో ఉత్తమ బ్యాటర్?గా నిలవాలని అనుకుంటున్నా. గత ఫలితాలను పెద్దగా పట్టించుకోం. పూర్తి స్థాయిలో బరిలోకి దిగుతాం. మా ఆటతీరుపై అవగాహన రావాలంటే ఆగస్టు దాకా వేచి ఉండండి’ అని గిల్ పేర్కొన్నాడు. కాగా, ఈ సిరీస్?లో భారత్ ఐదు టెస్టు ఆడనుంది. ఇందులో భాగంగా తొలి మ్యాచ్ శుక్రవారం ప్రారంభం అవుతుంది. ప్రతి మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభం కానుంది. సోనీ స్పోర్ట్స్ 5 ఛానెల్?, సోనీ లివ్, జియోస్టార్?లో లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉండనుంది.

## నల్లటి బ్యాండ్లతో బరిలోకి దిగిన టీమిండియా క్రికెటర్లు



భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభమైంది. ఇరు జట్ల మధ్య శుక్రవారం (జూన్ 20)న ప్రారంభమైన మొదటి టెస్టులో టాస్ గెలిచిన ఇంగ్లాండ్, భారత్‌ను ముందుగా బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలి మ్యాచ్ లీడ్స్‌లోని చారిత్రాత్మక హెడింగ్లీ మైదానంలో జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో యంగ్ ప్లేయర్ సుదర్శన్ తన టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టగా, మరో సీనియర్ ప్లేయర్ కరుణ్ నాయర్ కూడా 8 సంవత్సరాల తర్వాత ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చాడు. అయితే ఈ టెస్ట్ మ్యాచ్‌లో, రెండు జట్ల ఆటగాళ్లు నల్లటి చేతి బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళులు అర్పించడానికి రెండు జట్ల ఆటగాళ్లు నల్లటి బ్యాండ్‌లు ధరించారు. జాతీయ గీతానికి ముందు రెండు జట్లు రెండు నిమిషాల మౌనం పాటించాయి. జూన్ 12న, అహ్మదాబాద్ నుండి లండన్‌కు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం %ూ×%171 టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. ఈ ప్రమాదంలో 270 మందికి పైగా మరణించారు.జూన్ 12న మధ్యాహ్నం 1:38 గంటలకు ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. ఈ విమానంలో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. ప్రయాణీకులలో 169 మంది భారతీయులు, బ్రిటన్, పోర్చుగల్ మరియు కెనడా పౌరులు ఉన్నారు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీతో సహా మొత్తం 270 మందికి పైగా ఈ ఘోర ప్రమాదంలో మరణించారు. దీనికి సంతాప సూచకంగానే ఇరు జట్ల ఆటగాళ్లు నల్లటి బ్యాండ్లు ధరించి మైదానంలోకి దిగారు.

# ధోనీ రికార్డు పై కన్నేసిన పంత్..!!

ఇంగ్లాండ్‌లో రిషబ్ పంత్ ఒక ప్రత్యేకమైన రికార్డును నెలకొల్పే అవకాశం ఉంది. ఒకవేళ అది జరిగితే, మహేంద్ర సింగ్ ధోనీ పేరిట ఉన్న ఒక అరుదైన రికార్డును పంత్ అధిగమిస్తాడు. ప్రస్తుత సిరీస్‌లో రిషబ్ పంత్‌కు 267 పరుగులు చేసే అవకాశం ఉంది. అంతేకాకుండా, జట్టులో కీలక స్థానంలో ఉన్నాడు. అయితే, పంత్ బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు జరిగే అవకాశం ఉంది. ఒకవేళ అతనికి 289 పరుగులు చేసే అవకాశం వస్తే, అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్‌లో 800 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు.భారత క్రికెట్ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకోవడం పంత్‌కు చాలా ముఖ్యం. అయితే, గత కొన్ని మ్యాచ్‌లలో అతను ఆశించిన స్థాయిలో రాణించలేదు. దీంతో జట్టు యాజమాన్యం అతనిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈసారి భారత జట్టు ఇంగ్లాండ్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడనుంది కాబట్టి, రిషబ్ పంత్ ఈ విజయాలు సాధించే అవకాశం ఉంది.ఈసారి భారత జట్టులో ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ,రోహిత్ శర్మ లేరు. అందువల్ల, రిషబ్ పంత్ అదనపు బాధ్యతను తీసుకోవాల్సి వస్తోంది. అతను నిలబడి జట్టు స్కోరును పెంచాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రిషబ్ పంత్ బాధ్యతాయుతంగా ఆడతాడా లేదా అనే అంచనా అభిమానుల్లో ఉంది.ఈ సందర్భంగా ఒక అభిమాని స్పందిస్తూ.. “భారత జట్టును ఓటమి పాలు చేయకూడదు. రిషబ్ పంత్‌కు తగిన ప్రోత్సాహం ఇవ్వండి” అని కోరాడు.మొత్తానికి రిషబ్ పంత్ రాబోయే మ్యాచ్‌లలో ఎలా రాణిస్తాడో వేచి చూడాలి.

# 8 వసంతాలు...కొత్త ప్రయత్నం






అగ్ర నిర్మాణ సంస్థలు అప్పుడప్పుడూ కొత్తతరంతో... పరిమిత వ్యయంతో కూడిన సినిమాలు కూడా నిర్మిస్తుంటాయి. అలా మైత్రీ మూవీ మేకర్స్ నుంచి వచ్చిన చిత్రమే... '8 వసంతాలు'. పలువురు కొత్తతరం నటులు కలిసి నటించిన ఈ చిత్రం శుక్రవారం పరేక్షకుల ముందుకు వచ్చింద. ఓ ప్రేమజంట జీవితంలోని 8 వసంతాల కథ ఇది. శుద్ధి అయోధ్య (అనంతిక సనీల్‌కుమార్) అనే యువతి ఓ రచయిత. ఊటీలో ఉంటూ తన టీనేజ్‌లోనే ఓ పుస్తకం రాస్తుంది. దాంతో ఎంతోమంది అభిమానుల్ని సొంతం చేసుకుంటుంది. మార్షల్ ఆర్ట్స్‌లోనూ ఆమె ప్రావీణ్యం సంపాదిస్తుంది. ప్రయాణాలు, రచనలు, మార్షల్ ఆర్ట్స్‌తో గడుపుతున్న ఆమె జీవితంలోకి వరుణ్ (హను రెడ్డి) వస్తాడు. కొన్ని రోజుల్లోనే ఇద్దరి మనసులు కలుస్తాయి. వరుణ్ తన మనసులోని మాటని చెబుతాడు. శుద్ధి కొంత సమయం కావాలని కోరుతుంది. అందుకు వరుణ్ కూడా అంగీకారం చెబుతాడు. అలా కొన్ని నెలలు గడిచిపోతాయి. ఆ తర్వాత శుద్ధి తన మనసులోని ప్రేమని వ్యక్తపరచాలని ఎంతో ఆత్రుతగా వరుణ్ దగ్గరికి వస్తుంది. మరి వరుణ్... ఆమె ప్రేమని స్వీకరించాడా? ఈ మధ్యలో వరుణ్ జీవితంలో ఏం జరిగింది? వరుణ్ విదేశాలకు వెళ్లిపోయిన తర్వాత ఆమె జీవితంలోకి వచ్చిన సంజయ్ (రవి దుగ్గిరాల) ఎవరు? శుద్ధి ఎనిమిది వసంతాల ప్రేమ ప్రయాణంలో ఎన్నో మలుపులు చోటుచేసుకున్నాయన్నది చిత్ర కథ. 8 వసంతాలు కవితాత్మకంగా సాగే ఓ ప్రేమకథ ఇది. తెరపైన కనిపించే ప్రతి ఫ్రేమ్... ప్రతి సంభాషణ భావుకతని నింపుకొని ఉంటాయి. విజువల్స్ వరకూ కట్టిపడేసినా... ఒక దశ దాటిన తర్వాత సంభాషణలే కృత్రిమంగా అనిపిస్తాయి. అవి సినిమాపై ఏమాత్రం ప్రభావం చూపించకపోగా, పాత్రలతో పనిగట్టుకొని పలికించినట్టుగా అనిపిస్తాయి. భావుకత గురించి ఎక్కువగా ఆలోచించిన దర్శకుడు... భావోద్వేగాల సంగతిని మరిచిపోయాడు. దాంతో కథ హృదయాల్ని తాకదు. కథనం నెమ్మదిస్తుంది. కొంతలో కొంత ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. వరుణ్, శుద్ధి కలవడం, ఆ ఇద్దరి మధ్య ప్రేమ చిగురించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచుతాయి. అందంగా కనిపించిన హను రెడ్డి, అనంత మధ్య కెమిస్ట్రీ, హెషామ్ సంగీతం సినిమాని ఆకర్షణీయంగా మార్చేశాయి. అయితే విరామం తర్వాత సినిమా పూర్తిగా గాడి తప్పినట్లు అనిపించింది. ద్వితీయార్ధంలోని ప్రేమకథలో ఏమాత్రం బలం లేకపోగా, చాలా సన్నివేశాలు మెలో డ్రామాని తలపిస్తాయి. సంజయ్ రాసిన రాణిమాలిని అనే వేశ్య కథని చదివి, అతనితో ప్రేమలో పడటం కానీ, ఆ ప్రేమని త్యాగం చేయాలనుకోవడం కానీ ఏమాత్రం సహజంగా అనిపించదు. ప్రథమార్ధంలో శుద్ధి పాత్ర ఎంత బలంగా, ఎంత హుందాగా కనిపిస్తుందో... చివరికి వచ్చేసరికి ఆ పాత్ర తాలూకు ప్రభావం తగ్గిపోతుంది. అనంతిక సనిల్‌కుమార్ అందం, ఆమె నటన ఈ సినిమాకి ప్రత్యేకం. ఆమె స్క్రీన్ ప్రజెన్స్ ప్రేక్షకుల్ని కళ్లు తిప్పుకోనీయకుండా చేస్తుంది. హావభావాలు అద్భుతం అనిపిస్తాయి. లవర్‌బాయ్‌గా కనిపించిన హను రెడ్డి ప్రేమకథలకి తగ్గ హీరో అనిపిస్తాడు. అతని స్క్రీన్ ప్రజెన్స్ కూడా చాలా బాగుంది. భావోద్వేగాలతోనూ మెప్పిస్తాడు. మరో నటుడు రవి దుగ్గిరాల తన పాత్రకు న్యాయం చేశాడు.సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. ముఖ్యంగా విశ్వనాథ్ రెడ్డి కెమెరా పనితనం అద్భుతం అనిపిస్తుంది. ఊటీ, కశ్మీర్ అందాల్ని ఆయన తన కెమెరాతో చూపించిన తీరు మణిరత్నం సినిమాల్ని గుర్తు చేస్తుంది. హెషామ్ సంగీతం మరో హైలైట్. దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి కవితాత్మక స్పర్శతో కథని చెప్పాలనుకోవడం మెచ్చుకోదగ్గ ప్రయత్నమే.

# అల్లు అర్జున్, అట్లీ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్

## యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ఫిక్స్ అయినట్లు టాక్

పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ డైరెక్షన్ లో సినిమా వస్తున్నా సంగతి తెలిసిందే. బన్నీ కెరీర్ లో 22వ సినిమాగా వస్తున్న ఈ సినిమాపై ఇప్పటి నుండే అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. కోలీవుడ్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్స్ లో ఒకటైన సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్ పై ఈ సినిమాను నిర్మిస్తోంది. దీపికా పాడుకొనే, మృణాల్ ఠాకూర్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు.కాగా ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ ఎవరు అనే క్యూరియాసిటీ నెలకొంది. అనిరుధ్, సాయి అబ్యాంకర్ వీరి ఇద్దరు పేర్లు గత కొన్ని నెలలుగా వినిపిస్తున్నాయి. కానీ ఎవరిని లాక్ చేయలేదు మేకర్స్. ఇప్పుడు అందుతున్న విస్వసనీయ సమాచారం ప్రకారం అల్లు అర్జున్, అట్లీ సినిమాకు కోలీవుడ్ యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ను ఫిక్స్ చేసారని తెలిసింది. త్వరలోనే ఈ విషయాన్నీ అధికారకంగా ప్రకటించ బోతున్నారట మేకర్స్. కోలీవుడ్ లో ఇప్పుడు సాయి సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాడు. ఇప్పటికే సూర్య నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం కరుప్పు తో పాటు లోకేష్ కనగరాజ్ నిర్మిస్తున్న బెంజ్, ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ సినిమాలకు మ్యూజిక్ అందిస్తున్నాడు. ఇప్పుడు అల్లుఅర్జున్ ? అట్లీ కాంబోకు కు కూడా ఈ యువ సంచలం మ్యూజిక్ ఇస్తుండడం మనోడి క్రేజ్ ఎలా ఉందొ తెలుస్తోంది.




# నాని హిట్-3 సినిమాకు చిక్కులు


## కథను కాపీ కొట్టారంటూ కోర్టుకెక్కిన రచయిత

నాచురల్ స్టార్ నాని హీరోగా, శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హిట్-3'. మే 1వ విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. నాని కెరీర్‌లోనే 100 కోట్ల క్లబ్‌లో చేరింది. అయితే తాజాగా ఈ సినిమా చిక్కుల్లో పడింది. ఈ సినిమాలో తన కథను కాపీ కొట్టారని అంటూ.. ఓమహిళ కోర్టుకెక్కింది. హిట్-1, హిట్-2 చిత్రాల సిరీస్‌లో భాగంగా శైలేష్ హిట్-3ని తెరకెక్కించారు. అయితే తన స్టోరీని కాపీ కొట్టారంటూ మహిళా రచయిత విమల్ సోని మద్రాస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతేకాక విమల్ సోని నానికి వీరాభిమాని అని పేర్కొన్నారు. తాను రాసిన ఏజెంట్ 11, ఏజెంట్ కథల నుంచి హిట్-3 సినిమాను తీశారని ఆమె తెలిపారు. దీంతో హిట్-3 మేకర్స్‌పై కాపీరైట్ కేసు వేశారు. ఆమె రచించిన ఒరిజినల్ కాపీని కోర్టుకు సమర్పించారు. అయితే గతంలో కూడా దర్శకుడు శైలేష్ కొలను ఇలాంటి వివాదాన్ని ఎదురుకున్నారు. వెంకటేష్ హీరోగా ఆయన 'సైంధవ్' అనే సినిమాను తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఈ సినిమా కథను కూడా కాపీ కొట్టారు అంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.




# శేఖర్ కమ్ములకు పరీక్ష పెట్టిన కుబేర

ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందించిన తొలి మల్టీస్టారర్, పాన్ ఇండియా మూవీ 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ కమ్ముల సైతం నిర్మాణ భాగస్వామి. నాగార్జున, ధనుష్, రశ్మికా మందణ్ణ కీలక పాత్రలు పోషించిన 'కుబేర' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో ఉన్నవారికి, లేనివారికి మధ్య వ్యత్యాసం నానాటికి పెరిగిపోతోంది తప్పితే తగ్గడం లేదు. ధనవంతులు మరీ ధనవంతులు అవుతుంటే, బీదవారు ప్రభుత్వాల సబ్సిడీలతో జీవితాల్ని వెళ్ళబుచ్చుతున్నారు. ఈ సబ్సిడీలు రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంగా ఇచ్చే తాయిలాలు మాదిరిగా అయిపోయాయి. ప్రభుత్వాధీనంలో ఉండాల్సిన ప్రధాన రంగాలు సైతం నిదానంగా కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్ళిపోతున్నాయి. వాటి ద్వారా కోటాను కోట్లు సంపాదిస్తున్న ఆ కంపెనీలే ప్రభుత్వాలను ఆటాడిస్తున్నాయి. అలాంటి ఓ కార్పొరేట్ టైకూన్ కథే 'కుబేర'. దేశంలోనే అత్యంత ధనికుడైన నీరజ్ మిత్ర (జిమ్ సార్బ్) కు వరల్డ్ రిచెస్ట్ పర్సన్ గా నిలవాలనే కోరిక. దాంతో కేంద్ర మంత్రి సిద్ధప్ప (హరీశ్ పేరడి)తో డీల్ కుదుర్చుకుని లక్షల కోట్ల లంచం ఇచ్చి బంగాళఖాతంలోని ఆయిల్ డిగ్గింగ్ ఏరియాను తన వశం చేసుకుంటాడు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన లంచంలో సగం వైట్ లో, సగం బ్లాక్ లో ఇవ్వాల్సి వస్తుంది. దాంతో నిజాయితీతో నడుచుకుని జైలు పాలైన సస్పెండెడ్ సీబీఐ ఆఫీసర్ దీపక్ రాజ్ (నాగార్జున) సాయం తీసుకుంటాడు. అతన్ని జైలు నుండి బయటకు తీసుకొచ్చి... ఈ డీల్ ను ఫుల్ ఫిల్ చేసే పనిని అప్పగిస్తాడు. రంగంలోకి దిగిన దీపక్... నలుగురు బిచ్చగాళ్ళను ఎంచుకుని వారి ద్వారా కథ నడుపుతాడు. అలా వీరు ఎంచుకున్న దేవా (ధనుష్) అనే బిచ్చగాడి కారణంగా పరిస్థితులు చేజారిపోతాయి. ప్రభుత్వానికి, సంబంధిత







అధికారులకు నీరజ్ ఇవ్వాల్సిన లక్షల కోట్ల లంచం ముట్ట చెప్పగలిగాడా? వరల్డ్ రిచ్చెస్ట్ పర్సన్ కావాలనుకున్న నీరజ్ కోరిక నెరవేరిందా? తిరుపతిలో బిచ్చగాడిగా ఉన్న దేవా... ప్రభుత్వాలను శాసించగలిగే కార్పొరేట్ టైకూన్ జీవితాన్ని ఎలా అల్లకల్లోలం చేశాడు? అనేది 'కుబేర' కథ.రాజకీయ నాయకులకు బినామీలు ఉన్నట్టే... కార్పొరేట్ సంస్థలు బినామీలతో షెల్ కంపెనీస్ నిర్వహిస్తుంటాయి. వాటి ద్వారా కోటానుకోట్ల ట్రాన్సాక్షన్స్ చేస్తుంటాయి. ఒకవేళ అవినీతి నిరోధక శాఖ వంటి వారు వీరిని టచ్ చేసినా... చేతికి మట్టి అంటకుండా హాయిగా దులిపేసుకుంటారు. అనామకుల పేర్లతో దందాను సజావుగా నడిపేస్తుంటారు. ఇందులో ఆ అనామకులు నలుగురు బిచ్చగాళ్ళు! అదే ఈ కథలోని కొత్తదనం. దాంతో ఇది కోట్లకు పడగలెత్తిన ఓ మల్టీ మిలియనీర్ వర్సెస్ బెగ్గర్ కథగా మారిపోయింది. వీరిద్దరి మధ్యలో కథను నడిపేది ఓ సస్పెండెడ్ సీబీఐ ఆఫీసర్!! ఇలాంటి ఓ కథను మూడు గంటల సినిమాగా తీసి... ప్రేక్షకులను మెప్పించడం అనేది చాలా కష్టసాధ్యం. దర్శకుడిగా పాతికేళ్ళ అనుభవం ఉన్న శేఖర్ కమ్ముల వల్ల కూడా అది కాలేదు. ఈ మధ్య కాలంలో స్టార్ హీరోలు బిచ్చగాడి పాత్రలు చేయడానికి పోటీ పడుతున్నట్టుగా ఉంది. సినిమా మొత్తం కాకపోయినా.. కొన్ని సన్నివేశాలలో అయినా ఇలా డీ గ్లామర్ గా కనిపించడం జరుగుతోంది. ఇందులోనూ మల్టీమిలియనీర్ అయిన విలన్ తన డబ్బుల్ని కాపాడుకోవడానికి అలాంటి పనే చేస్తాడు. ధనుష్ బిచ్చగాడి పాత్రలో ఒదిగిపోయాడు. అతని నటనను వంక పెట్టడానికి లేదు. నిజానికి ఇందులో ధనుష్ కంటే నాగార్జున పాత్రకే నిడివి ఎక్కువ. అతని క్యారెక్టరే 360 డిగ్రీస్ ఉంది. తీవ్ర మానసిక సంఘర్షణకు లోనయ్యే ఆ పాత్రను నాగ్ బాగానే చేశాడు. అయితే ఆ క్యారెక్టర్ కు సినిమాటిక్ ముగింపు ఇవ్వడంతో తేలిపోయింది. ఇక రశ్మిక మందణ్ణ పాత్రను చూస్తుంటే 'చూడాలని ఉంది'లో సౌందర్య గుర్తొస్తుంది. ఆమె ప్రమేయం లేకుండానే పలు సంఘటనల్లో ఇరుక్కుపోతుంది. ఈ సినిమా చేయడం కూడా అలాంటిదే అనిపిస్తోంది. నటీనటుల్లో చెప్పుకోవాల్సిన మరో వ్యక్తి జిమ్ సార్బ్. కార్పొరేట్ టైకూన్ గా అదరగొట్టేశాడు. మిగిలిన వారూ సందర్భోచితంగా నటించారు. నాగ్ భార్య పాత్రను సునయన చేసింది. అయితే ఎంచుకున్న కథలో దమ్ములేకపోవడం, దాన్ని సరిగా తెర మీద ప్రెజెంట్ చేయక పోవడంతో ప్రేక్షకులు నిరాశకు గురికాకతప్పదు. సగటు ప్రేక్షకుడు కనెక్ట్ కాలేని కథను రాసుకుని శేఖర్ కమ్ముల తప్పుచేశారనిపిస్తుంది.

# సినిమా వాళ్ల కోసం సితారే జమీన్ పర్-ప్రియురాలు గౌరీ స్ప్రాట్‌తో కలసి వచ్చిన అమీర్ ఖాన్





బాలీవుడ్ స్టార్‌హీరో ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సితారే జమీన్ పర్'. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో ఆర్.ఎస్.ప్రసన్న దీనిని రూపొందించారు. ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. సినీ తారల కోసం గురువారం సాయంత్రం ఈ సినిమా ప్రీమియర్ షో ముంబయిలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి బాలీవుడ్ స్టార్ హీరోలు షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, అలనాటి నటి రేఖ, నటుడు విక్కీ కౌశల్‌తోపాటు పలువురు హాజరయ్యారు. సినిమా వీక్షించిన అనంతరం చిత్రబృందంతో తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమిర్ ప్రత్యేకాకర్షణగా నిలిచారు. తన ప్రియురాలు గౌరీ స్ప్రాట్‌తో కలిసి ఆయన ఈ వేడుకలో సందడి చేశారు. ఆమెతో చిరునవ్వులు చిందిస్తూ ఫొటోలకు పోజులిచ్చారు.ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సల్మాన్‌ఖాన్.. తన స్నేహితుడు ఆమిర్‌పై జోకులు వేశారు. ఈ సినిమా తానే చేయాల్సిందని మధ్యలో ఆమిర్ వచ్చి చేరారంటూ సరదాగా చెప్పారు. 'ఈ సినిమా తెరకెక్కించడానికి ముందు ఏం జరిగిందో మీకు తెలియదు. ఈరోజు నేను మీతో ఆ కథంతా చెబుతా. ఓసారి ఆమిర్ నన్ను ఇంటికి ఆహ్వానించి ఈ కథ గురించి చెప్పాడు. కథ నాకెంతో నచ్చింది. తప్పకుండా చేస్తానని చెప్పా. కొన్నిరోజుల తర్వాత ఆయన నుంచి ఫోన్ వచ్చింది. తానే ఈ సినిమా చేస్తున్నానని చెప్పాడు. అందుకు నేను సంతోషించాను. తన నిర్ణయాన్ని మెచ్చుకున్నాను' అని అన్నారు. అనంతరం ఆమిర్ ఖాన్ - కిరణ్‌రావు విడాకుల పైనా సల్మాన్ సరదాగా వ్యాఖ్యలు చేశారు. 'నిజం చెప్పాలంటే ఆమిర్ ఈ కథ నాకెప్పుడో చెప్పారు. ఆయన అప్పుడే ఈ సినిమాపై వర్క్ చేయాల్సింది కాకపోతే ఆ సమయంలో వేరే పేపర్ వర్క్‌లో బిజీగా ఉన్నారు' అని అన్నారు. సల్మాన్ మాటలతో అక్కడున్న ఫొటోగ్రాఫర్లు అందరూ నవ్వులు పూయించారు. ఈ ఏడాది తన 60వ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో గౌరీ స్ప్రాట్‌తో రిలేషన్ గురించి ఆమిర్ బయటపెట్టారు. ఏడాదిన్నర నుంచి ఆమె తో డేటింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఆమెను మీడియాకు పరిచయం చేశారు. గౌరీ కొంతకాలంగా ఆమిర్‌ఖాన్ నిర్మాణసంస్థలో సహాయకురాలిగా పనిచేస్తున్నారు. వీరి మధ్య 25 ఏళ్ల స్నేహబంధం ఉంది.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685